# ప్రజాపక్షం
## జిల్లా అనుబంధం

కరీంనగర్ సిరిసిల్ల పెద్దపల్లి జగిత్యాల నిర్మల్
ఆదిలాబాద్ మంచిర్యాల నిజామాబాద్ కామారెడ్డి

శుక్రవారం | 14 | ఫిబ్రవరి | 2025 పేజీలు 8


## టెన్త్‌లో 100% ఉత్తీర్ణత సాధించాలి



ప్రజాపక్షం/ కాగజ్‌నగర్ రూరల్ : పదో తరగతి విద్యార్థులు నూరుశాతం ఉత్తీర్ణత సాధించేలా ప్రధానోపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యా శాఖ అధికారి గమానియల్ అన్నారు. గురువారం కాగజ్‌నగర్ మండలంలోని కస్తూర్బాగాంధీ బాలికల విద్యాలయం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల నజ్రూల్‌నగర్ నెంబర్ 3,5 పాఠశాలలను ఆయన ఆకస్మీకంగా తనిఖీ చేశారు. పాఠశాలల్లో వందశాతంలో భాగంగా పదో తరగతి విద్యార్థులకు నిర్వహిస్తున్న ప్రత్యేక తరగతులను, స్లిప్ టెస్టుల నివేదికలను పరిశీలించి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. పదో తరగతి విద్యార్థులను వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ప్రశ్నలు అడిగి సమాధానాలు రాబట్టారు. కాగజ్‌నగర్ పట్టణంలోని జడ్‌పిఎస్‌ఎస్ పెట్రోల్ పంప్ పాఠశాలలో నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించి మొదటిసారిగా విచ్చేసిన విద్యాశాఖ అధికారిని కాగజ్‌నగర్ మండల విద్యాశాధికారి వాసాల ప్రభాకర్ ఆధ్వర్యంలో ఎంఆర్‌సి సిబ్బంది సత్కరించారు.

## భవన కార్మికుల గోడు పట్టదా?



ప్రజా పక్షం/వేములవాడ టౌన్: వేములవాడ పట్టణంలో భవన నిర్మాణ కార్మిక సంగం జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు గురువారం మాట్లాడుతూ, లేబర్ కార్డులు ఉన్న వారికి హెల్త్ చెకప్ పేరుతో భవన నిర్మాణ కార్మిక సంక్షేమ బోర్డులో ఉన్న ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారని, చేసిన పరీక్ష రిపోర్టులు, వేరే హాస్పిటల్లో కి తీసుకుపోతే పక్కన పారేస్తున్నారని, మళ్ళీ టెస్టులు చేస్తున్నారని అన్నారు. 1996 లో కొట్లాడి తెచ్చుకున్న లేబర్ కార్డుల చట్టం, గత బిఆర్ఎస్, ప్రస్తుత బీజేపీ ప్రభుత్వాల వల్ల 44 చట్టాలు రద్దయి, 4 కోడ్ లుగా విభజించబడయని, కనీస వేతన చట్టం లేక, నిత్యావసరాల మీద జి ఎస్ టి వేయడం, గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు పెంచడంతో ధరలు పెరిగి కార్మికులు తమ కొనుగోలు శక్తిని కోల్పోతున్నారని అన్నారు. లేబర్ కార్డుల విధానంలో ఆన్లైన్ విధానం తీసుకు రావడం మూలంగా, ఫింగర్ ప్రింట్ రాక, ఆన్లైన్ రావడం లేదని, వెంటనే ఆన్లైన్ రద్దు చేసి, పెండింగ్ ఫైల్స్ క్లియర్ చేయాలని, కార్మికులకు అందించే బెనిఫిట్స్ అందించాలని, సహజ మరణంపై 5లక్షలు,ఆక్సిడెంట్ కు 10 లక్షలు, డెలివరీ 50 వేలు, మ్యారేజ్ 1 లక్ష రూపాయలు. 55 ఏండ్లు నిండిన కార్మికులకు 5 వేల పెన్షన్ ఇవ్వాలని, మెడికల్ టెస్టుల పేరుతో జరుగుతున్న దోపిడీని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంగం జిల్లా అధ్యక్షులు గాజుల పోశెట్టి, కోరేపు శ్రీను, మల్లేశం, రాజయ్య తదితర కార్మిక సంగం నాయకులు పాల్గొన్నారు.

# అది రీసర్వే కాదు.. మిస్ అయిన వారి కోసమే..



మెయిన్‌లో..

## డిఫాల్టర్ రైస్‌మిల్లర్లపై చర్యలు

**వారంలోగా సిఎంఆర్ బాకీ చెల్లించాలని ఆదేశాలు**

**59మంది డిఫాల్టర్లతో సివిల్‌సప్లైస్ టాస్క్‌ఫోర్స్ సమీక్ష**

ప్రజాపక్షం/కరీంనగర్: కరీంనగర్ జిల్లాలో కస్టమ్ మిల్లింగ్ రైస్(సిఎంఆర్) ఇవ్వకుండా బాకీ పడ్డ 59 మంది డిఫాల్టర్లపై చర్యలకు పౌరసరఫరాల శాఖ సిద్ధమయ్యింది. ఈమేరకు కరీంనగర్‌లో సివిల్‌సప్లైస్ కరీంనగర్, టాస్క్‌ఫోర్స్ హెడ్ గురువారం కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ లక్ష్మి కిరణ్, టాస్క్‌ఫోర్స్ హెడ్ ప్రభాకర్ సమక్షంలో సమీక్షించారు. జిల్లాలో 2019–20 రబీ నుంచి 2022–23 ఖరీఫ్ వరకు గల 59 మంది డిఫాల్టర్ రైస్‌మిల్లర్లు బాకీ ఉన్న సిఎంఆర్ విలువను బ్యాంకు గ్యారంటీ, నగదును కరీంనగర్ జిల్లా పౌరసరఫరాల సంస్థ మేనేజర్‌కు వారం రోజుల్లోగా చెల్లించాలన్నారు. అదే విధంగా ఖరీఫ్ 2023–24 సీజన్‌కు సంబంధించి బాకీ ఉన్న 25 మంది రైస్‌మిల్లర్లను స్టేట్ పూల్ రైస్ కింద సివిల్ సప్లై కార్పోరేషన్ కరీంనగర్‌కు వారం రోజుల్లోగా డెలివరీ చేయాలని కోరారు. లేని పక్షంలో చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. సివిల్ సప్లైస్ డిఎం రజినీకాంత్, డిఎస్‌వో నర్సింగరావు, సివిల్ సప్లయిస్ డిప్యూటీ తహసీల్దార్లు, రైస్‌మిల్లర్ల సంఘం నాయకులు, రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

## నిరంతర కృషితోనే ఉన్నత శిఖరాలు



ప్రజాపక్షం / ధర్మపురి : ఉన్నత లక్ష్యాలు సాధించాలంటే విద్యార్థి దశ నుండే నిరంతర కృషి చేయాలని తద్వారా ఉన్నత శిఖరాలను చేరుకోవచ్చని సామాజిక సేవకుడు ఇంపాక్ట్ ట్రైనర్ రేణికుంట రమేష్ అన్నారు. జగిత్యాల జిల్లా ధర్మపురి మండలం మగ్గిడిలోని సాంఘీక సంక్షేమ పాఠశాల, కళాశాల విద్యార్థులకు వ్యక్తిత్వ వికాసం, మత్తు పదార్థాల నివారణపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ విద్యార్థులు ఎలాంటి స్థితిలో ఉన్నప్పటికి, కష్టపడి చదివితే ఉన్నత స్థితికి చేరుకోవచ్చని, భవిష్యత్తు లక్ష్యాలను ముందుగానే ఊహించుకొని అందుకు అనుగుణంగా కష్టపడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గోనె రమేష్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

## మురికికాలువలు శుభ్రం చేయండి

**సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్**



ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి : రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో 9వ డివిజన్ జనగామ లోని గణేష్ నగర్ వాడలో మురికి కాలువలను శుభ్రం చేయించాలని, చెత్త కుప్పలను తొలగించి వాడ ప్రజలు అనారోగ్యాలకు గురి కాకుండా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సిపిఐ నగర కార్యవర్గ సభ్యులు తొడుపునూరి రమేశ్ కుమార్ ఒక ప్రకటన లో కోరారు. మురికి కాలువ ల్లోని పూడికను తొలగించకపోవడంవల్ల కాలువల్లో మురికి నీరు నిల్వ ఉండి దోమలు ఈగలు వ్యా ప్తి చెంది వాడ ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తున్నాయ ని, దీంతో పాటు చెత్త కుప్పలను తొలగించకపోవడం వల్ల దుర్వాసనతో ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి 9వ డివిజన్ జనగామ లోని గణేష్ నగర్ వాడలో ఉన్న మురికి కాలువ ల్లోని పూడికను తొలగించాలని డిమాండ్ చేశారు.

## మహాశివరాత్రికి ప్రత్యేక బస్సులు



ప్రజాపక్షం/నిర్మల్ టౌన్ : మహా శివరాత్రి సందర్భంగా నిర్మల్ డిపో పరిధిలోని ప్రముఖ శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నట్లు డిపోమేనేజర్ ప్రతిమా రెడ్డి తెలిపారు.గురువారం డిపో మేనేజర్ కార్యాలయములో నిర్మల్ డిపోకు సంబందించిన కంట్రోలర్ లతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు.మన డిపో పరిధిలోని కదిలే పాపహరేశ్వర్,బూర్గుపల్లి,కాల్వ,ఇతర శైవ క్షేత్రాలకు ప్రత్యేక బస్సులు నడుపుతున్నాము,భక్తులకు ఇబ్బంది కలుగకుండా రద్దీకి అనుగుణంగా అన్ని పుణ్య క్షేత్రాలకు అవసరమయిన బస్సులు తిప్పాలని,అందరూ సమిష్టి కృషితో పనిచేయాలని ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా భక్తులను తమ గమ్యస్థానాలకు చేరవేయాలని బస్సులు ఎలాంటి బ్రేక్ డౌన్‌కు గురి కావద్దని సూచించారు.ఈ కార్యక్రమంలో అసిసెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్,అసిస్టెంట్ ఇంజనీర్(ఎం) నవీన్‌కుమార్ కంట్రోలర్లు పాల్గొన్నారు.

## ఎంపిటిసి ఎన్నికలపై సమావేశం

**ప్రజాపక్షం/వెల్గటూర్:** జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల ఎన్నికల ముసాయిదా పోలింగ్‌పై రాజకీయ నాయకులతో ఎండపల్లి ఎంపీడివో ఉప్పనపల్లి నరేష్ గురువారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండలంలోని అన్ని రాజకీయ పార్టీలు , పార్టీల నాయకులు హాజరుకావాలని ఆహ్వానించారు. ఇందుకుగాను బిఆర్ఎస్ పార్టీ నుంచి సింహచలం జగన్, బిజెపి పార్టీ నుంచి కొమ్ము రాంబాబు యదవ్ హాజరయ్యారు. మండలంలోని ఎంపిటిసి స్థానాలు, వార్డులు , పోలింగ్ స్థానాలు , ఓటర్లు, జనాభా వివరాలు వెల్లడించారు.

## రంగరాజన్‌పై దాడిని ఖండించిన అర్చకులు



**ప్రజా పక్షం/ వేములవాడ:** రంగారెడ్డి జిల్లా చిలుకూరు బాలాజీ ఆలయం ప్రధాన అర్చకులు రంగరాజన్ పై దాడి కలకలం రేపుతున్న సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయ అర్చకులు, ఆలయ యూనియన్ సభ్యులు గురువారం ప్రధాన అర్చక ఈశ్వరిగారి సురేష్, ఉప ప్రధాన అర్చక ఆలయ యూనియన్ ఉపాధ్యక్షులు చంద్రగిరి శరత్, గోపన్నగారి చందు మాట్లాడుతూ. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం చూడాలని, ఆలయ అర్చకులకు రక్షణ కల్పించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు శ్రీధర్, అర్చక స్వాములు, ఏఈఓ శ్రావణ్, ఆలయ పర్యవేక్షకువరి నరసయ్య, జనరల్ సెక్రటరీ కే.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## లాయక్ పాషాకు సన్మానం



**ప్రజాపక్షం/వేములవాడటౌన్:**తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్టుల సంఘం టియుడబ్ల్యూజే హెచ్ 143 రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షులు లాయక్ పాషాకు గురువారం ఘన సన్మానం జరిగింది. యువ చైతన్య దీపం ఫౌండేషన్ చైర్మన్ శేఖర్ సేనాపతి ఆధ్వర్యంలో లాయక్ పాషాను శాలువాతో సత్కరించి ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలే జరిగిన టియుడబ్ల్యూజే ఎన్నికలలో రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షునిగా లాయక్ పాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఫౌండేషన్ మైనారిటీ అధ్యక్షులు అబ్దుల్ రజాక్, పట్టణ ఇంచార్జ్ మహమ్మద్ కలీం, సభ్యులు మహమ్మద్ యాసీన్, మహమ్మద్ అక్బర్ పాషా, కాసర్ల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు. సన్మాన గ్రహీత వారికి కృతజ్ఞతలు తెలిపారు.

# వేటకు వెళ్లిన నరసింహుడు



**ప్రజాపక్షం/బీర్‌పూర్:** జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలంలో కొలువైన ఉన్న శ్రీ లక్ష్మి నరసింహస్వామి జాతర బ్రహ్మోత్సవాల్లో భాగంగా పెరట్ ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు . లక్ష్మి నరసింహస్వామి కోయ జాతికి చెందిన వారికి రాక్షసుల నుండి విముక్తి కలిగించడానికి ఆ ఆదివాసులు స్వామివారిని కోరగా వారిని రక్షించడానికి స్వామి వారు వేటకు వెళ్లి రాక్షసులను సంహరించి వారిని కాపాడారు. దానికి ఆ కోయ జాతికి చెందిన వారు సెంచు లక్ష్మి ని వివాహము ఆడమని కోరగా స్వామి వారు అంగీకరించి చెంచులక్ష్మి ని వివాహమడి తీసుకొచ్చారని శాస్త్ర పురాణాలు చెబుతున్నాయని అన్నారు. ఆరోజునుండి స్వామివారికి చెంచులక్ష్మి ఆది లక్ష్మి ఇద్దరు భార్యలుగా ఉన్నారని తెలిపారు. స్వామి వార్లకు అందరు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్బంగా పార్వట్ ఉత్సవాన్ని ఆలయ పూజారులు ఒద్దిపతి సంతోష్‌కుమార్ చార్యులు చిన్న సంతోష్‌కుమార్ మధుచార్యులు ప్రత్యేక పూజలు చేసి ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్, ఆలయ సిబ్బంది ఎడ్ల వెంకటేష్ భక్తులు పాల్గోన్నారు.

## విద్యుత్ సరఫరా పనులు సకాలంలో పూర్తి చేయాలి



**ప్రజాపక్షం/పెద్దపల్లి ప్రతినిధి :** జిల్లాలోని అంగన్వాడీ కేంద్రాలు, డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు విద్యుత్ సరఫరా పనులను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో విద్యుత్ శాఖ పై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాలలో చేపట్టిన విద్యుత్ సరఫరా పనులను 3 రోజుల్లో పూర్తి చేయాలని కలెక్టర్ సూచించారు. జిల్లాలో ఇప్పటి వరకు 266 అంగన్వాడి కేంద్రాలకు విద్యుత్ సరఫరా పనులు పూర్తి చేశామని, పెండింగ్ ఉన్న 47 అంగన్వాడి కేంద్రాల పనులు 3 రోజులలో పూర్తి కావాలని అన్నారు. జిల్లాలో మారుమూల ప్రాంతాల్లో ఉన్న మరో 26 అంగన్వాడి కేంద్రాలకు ప్రత్యేకంగా లైన్ వేసి విద్యుత్ సరఫరా కల్పించాలని, ఈ పనులను వారం రోజులలో పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. పెద్దపల్లి పట్టణంలోని చందంపల్లి, రాంపల్లిలో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్లకు విద్యుత్ సరఫరా పనులు వారం రోజుల వ్యవధిలో పూర్తి చేసి ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. ఈ సమావేశంలో విద్యుత్ శాఖ ఎస్ఈ పెద్దపల్లి మాధవరావు, మంథని డీఈ ప్రభాకర్, పెద్దపల్లి డిఈ తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.

## 43 మందికి కంటి ఆపరేషన్లు పూర్తి



**ప్రజాపక్షం/గొల్లపల్లి :** గొల్లపల్లి లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి ఆసుపత్రి చైర్మన్ లయన్ కొండ వేణుమూర్తి ,వైస్ చైర్మన్ లయన్ చిదుర సురేష్ సహకారంతో మంగళవారం చందోలి గ్రామంలో నిర్వహించిన ఉచిత నేత్ర వైద్య శిబిరానికి భారీ స్పందన లభించిన విషయం తెలిసిందే. ఈ కంటి వైద్య శిబిరానికి వివిధ గ్రామాల నుంచి నేత్ర సంబంధిత వ్యాధులతో బాధపడే రోగులు శిబిరానికి రాగా 180 మందిని పరీక్షించగా 49 మందిని కంటి ఆపరేషన్ కోసం గుర్తించారు .వీరిలో 43 మందికి కంటి వైద్యులు ఆపరేషన్ నిర్వహించగావిజయవంతంగా పూర్తయింది .వీరిని లయన్స్ క్లబ్ ,రేకుర్తి కంటి ఆసుపత్రి వారు తిరిగి అదే గ్రామానికి గురువారం బస్సులో పేషెంట్లను తీసుకువచ్చి దింపారు .కంటి ఆపరేషన్ చేయించుకున్న వారు గొల్లపల్లి మండల లయన్స్ క్లబ్ కు కృతజ్ఞతలు తెలిపారు .ఆపరేషన్లు విజయవంతం కావడం పట్ల అధ్యక్షులు ముస్కు కరుణాకర్ రెడ్డి ,కార్యదర్శి సాయిని నరహరి ,వైస్ ప్రెసిడెంట్ బొమ్మెన కుమార్ సంతోషం వ్యక్తం చేశారు .ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షులు ముస్కు కర్ణాకర్ రెడ్డి,ఉపాధ్యక్షులుబొమ్మెన కుమార్ ,కార్యదర్శి సాయిని నరహరి ,కోశాధికారి సాతాల సత్యనారాయణ ,రీజినల్ చైర్మన్ తాడూరు సత్యనారాయణ,బొల్లం రమేష్ ,చంద్రశేఖర్,సట్ట సురేష్, అలిశెట్టి రవీందర్,బలభక్తుల కిషన్ , చింతం అశోక్ ,ఓరుగంటి అశోక్‌రావు పాల్గొన్నారు.

## పట్టభద్రుల, టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో విజయం ఖాయం



**ప్రజాపక్షం/గంగాధర:** పట్టభద్రుల, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి విజయం ఖాయమని రాష్ట్ర బిజెపి కోశాధికారి, కరీంనగర్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి శాంతకుమార్, జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, రాష్ట్ర అధికార ప్రతినిధి సంగప్ప. అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్‌లు ధీమా వ్యక్తం చేశారు. గంగాధర మండలం మధురానగర్‌లో చొప్పదండి నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నికల ఇంచార్జి వైద రామానుజన్ ఆద్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిధులుగా హాజరైన వారు మాట్లాడుతూ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజెపి బలపరిచిన అంజిరెడ్డి, మల్క కొమురయ్యల విజయం కోసం నిరుద్యోగ యువతీ యువకులు , ఉద్యోగులు స్వచ్ఛందంగా ముందుకు వస్తున్నారని పేర్కొన్నారు. ప్రతి బిజెపి కార్యకర్త వారి గెలుపు కోసం కృషి చేయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం జాబ్ క్యాలెండర్ పేరుతో నిరుద్యోగులను, 317 జీవో ద్వారా ఉద్యోగులను మోసం చేసిందన్నారు. గత పదేళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం చేసిన మోసాన్నే తిరిగి చేస్తోందన్నారు. నియోజకవర్గంలో పట్టభద్రులైన నిరుద్యోగులకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పిస్తామని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాటను నిలబెట్టుకోలేదన్నారు. నిరుద్యోగులందరూ కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పి బిజెపికి మద్దతివ్వాలని కోరారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేకల ప్రభాకర్ యాదవ్, నాయకులు ప్రబారి రవి ప్రభాకర్, బత్తుల లక్ష్మి నారాయణ, కర్నె ప్రభాకర్ రెడ్డి, బింగి వేణు, దూలం కళ్యాణ్, సింగిరెడ్డి కృష్ణారెడ్డి, తదితరులున్నారు.




## ఘనంగా ఇంగ్లీష్ డే

**ప్రజాపక్షం/తిమ్మాపూర్:** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో గురువారం ఇంగ్లీష్ లాంగ్వేజ్ డేని ఘనంగా నిర్వహించారు. స్కేర్ట్, ఎల్టా వారి ఆదేశాల మేరకు ఆంగ్ల ఉపాధ్యాయులు కవిత, రేణుక, సుష్మల ఆద్వర్యంలో పిల్లల సృజనాత్మకత వెలికితీసేలా ప్రదర్శన చేసి ఆంగ్ల బాష గొప్పతనాన్ని తెలియజేశారు. అంతర్జాతీయ స్థాయిలో ఆంగ్లబాష ప్రాధాన్యతపై ప్రిన్సిపాల్ వనజ వివరించారు. ఇంగ్లీష్ ఆక్టివిటీ ల్యాబ్‌ను అంజి ప్రారంభించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## గుడుంబా పట్టివేత

**ప్రజాపక్షం/ముత్తారం :** గుడుంబా తరలిస్తున్న వ్యక్తిని గురువారం ముత్తారం ఎస్సై నరేష్ ఆధ్వర్యంలో మాటువేసి జయశంకర్ భూపాలపల్లి జిల్లా మలహాల్ రావు మండలం అడ్వలపల్లి గ్రామానికి చెందిన అజ్మీర సంతోష్ అనే వ్యక్తిని ముత్తారం మండలంలోని ఖమ్మంపల్లి గ్రామ శివారులో 10 లీటర్ల గుడుంబా తో పాటు ద్విచక్ర వాహనాన్ని పట్టుకున్నట్లు ఎస్సై నరేష్ తెలిపారు.టాస్క్ ఫోర్స్ పోలీసులు పట్టుకొని కేసు నమోదు చేశారు.ఈ సందర్భంగా ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం అడ్వలపల్లికి చెందిన అజ్మీర సంతోష్ అనే వ్యక్తి మోటార్ సైకిల్ పై 10 లీటర్ల నాటు సారాతో ముత్తారం మండలానికి వస్తుండగా ఖమ్మంపల్లి గ్రామ శివారులో తనిఖీ చేసి సారా ప్యాకెట్ పట్టుకోవడం జరిగిందన్నారు. పట్టుకున్నది 10 లీటర్ల గుడుంబా తో పాటు ద్విచక్ర వాహనాన్ని సీజ్ చేయడం జరిగిందన్నారు. గుడుంబా తయారుచేసిన అమ్మిన శాఖా పరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

## స్కాలర్‌షిప్‌కు విద్యార్థుల ఎంపిక

**ప్రజాపక్షం/ముత్తారం :** నేషనల్ మీన్స్ కమ్ మెరిట్ స్కాలర్ షిప్ 2025 సంవత్సరానికి ముత్తారం మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికైనట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పద్మ దేవి, ఏ.ఏ.పి.సి అమ్మ లావణ్య పాఠశాల అధ్యాపక బృందం తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదవ తరగతి చదువుతున్న శ్రీ అక్షర, మహర్షి అనే విద్యార్థులు ఎన్ ఎమ్ ఎమ్ ఎస్ జాతీయ స్థాయి పరీక్షలో ప్రతిభ కనబరిచి స్కాలర్షిప్ కు ఎంపిక కావడం పట్ల పలువురు పాఠశాలల హెచ్ ఎమ్ లు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం పద్మ దేవి మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమిష్టి కృషితో విద్యార్థులు జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ఎంపికయ్యారని హెచ్ ఎమ్ తెలిపారు. ఎంపికైన విద్యార్థులకు నెలకు వెయ్యి రూపాయల చొప్పున ఏడాదికి రూ. 12 వేలు కేంద్రప్రభుత్వం నేరుగా విద్యార్థుల అక్కౌంట్లలో జమచేస్తుందని హెచ్ ఎమ్ తెలిపారు. వివిధ పాఠశాల విద్యార్థులు జాతీయ పోటీ పరీక్షల్లో ఎంపిక కావడం పట్ల ఉపాధ్యాయులు, గ్రామస్తులు, నాయకులు అభినందనలు తెలిపారు.

## ప్రధాని మోదీ, బండి చిత్రపటాలకు అభిషేకం

**ప్రజాపక్షం/గంగాధర:**పదిహేనుగ్రామాల ప్రజల చిరకాల వాంచ అయిన కురిక్యాల నుంచి బావుపేట ఆసిఫ్‌నగర్ వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ లైన్ రోడ్డుగా మంజూరు చేసినందుకు కృతజ్ఞతగా గురువారం మండలంలోని ఉప్పరమల్యాలలో బిజెపి గంగాధర మండల అధ్యక్షుడు పంజాల ప్రశాంత్ గౌడ్ ఆద్వర్యంలో ప్రధాని మోడీ, కేంద్ర మంత్రి బండి సంజయ్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ముఖ్య అతిధిగా చొప్పదండి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్, జిల్లా కోశాధికారి వైద రామానుజన్‌లు హాజరై మాట్లాడుతూ కురిక్యాల నుంచి బావుపేట వరకు దాదాపు రూ.25 కోట్ల నిధులు మంజూరు చేయించి డబుల్ లైన్ రోడ్డును వేయిస్తూ 15 గ్రామాల ప్రజల సమస్యను తీర్చారని పేర్కొన్నారు. మాజీ మండల అధ్యక్షుడు కోల్ల అశోక్, మాజీ ఉపసర్పంచ్ నూతన నర్సింహారెడ్డి, బిజెవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎడవెల్లి శశిధర్ రెడ్డి, ఎస్సీ మోర్చా అధికార ప్రతినిధి మల్యాల వినయ్ సాగర్, మోతి శ్రీహరి రెడ్డి, ఆల విజయేందర్ రెడ్డి, రేండ్ల శ్రీనివాస్, వొడ్నాల రాజు, గుండారపు మధు, ఆకుల మనోహర్, ఆళ్ల కర్ణాకర్, అమ్మిశెట్టి రవి, శ్రీనివాస్, గోగుల రాజు, కొప్పుల నాగరాజు, రవి తదితరులున్నారు.

## అల్లీపూర్‌లో రోడ్డు ప్రమాదం

ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి: జగిత్యాల జిల్లా రాయికల్ మండలంలోని అల్లిపూర్‌లో గురువారం రోడ్డు ప్రమాదం జరిగి పలువురికి గాయలయ్యాయి.జగిత్యాల నుండి రాయికల్ వెళ్తున్న ఓ కారు అల్లీపూర్ శివారులోకి రాగానే వేగంగా రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్థంబాన్ని ఢీ కొట్టింది.వెంటనే కారులోని ఏయిర్ బ్యాగ్స్ ఓపెన్ కావడంతో కారులో ఉన్న వారు సురక్షితంగా పెద్ద ప్రమాదం నుండి బయటపడి స్వల్ప గాయాలపాలయ్యారు.గాయపడిన వారిని చికిత్స నిమిత్తం అస్పత్రికి తరలించారు.

## యువతీ యువకులు సమాచారం ఇవ్వాలి

ప్రజాపక్షం/ముత్తారం: పెద్దపల్లి జిల్లా ముత్తారంమండల వ్యాప్తంగా ఉన్న గ్రామాల్లోని యువతి, యువకులు సెంట్రల్ గవర్నమెంట్ ఉద్యోగమైన అగ్ని వీర పోస్ట్ కు అప్లై చేసుకున్న వారు అప్లై చేయాలనుకుంటున్న యువతి ,యువకులు ముత్తారం పోలీస్ స్టేషన్ వచ్చి తమ వివరాలు తెలుపాలని ముత్తారం ఎస్సై గోపతి నరేష్ సూచించారు.

## పరామర్శించిన ఎంఎల్‌సి

ప్రజాపక్షం/జగిత్యాలటౌన్: జగిత్యాల పట్టణంలోని మంచినీళ్ల బావి సమీపంలో 29వార్డులో కట్ట రాం నారాయణ కి గుండెకు శస్త్ర చికిత్స జరుగగా వారి నివాసంలో ఎంఎల్‌సి జీవన్‌రెడ్డి కలిసి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు నీలం పెద్దలు, తోపారపు రజనీకాంత్, నాంచారి రాజు, కోయ కారి కిషన్, జంగిలి సత్తయ్య, గంగాధర్, తదితర నాయకులు ఉన్నారు.

## మహాశివరాత్రి జాతరకు పకడ్బందీ ఏర్పాట్లు

ప్రజాపక్షం/వేములవాడ: మహాశివరాత్రి జాతర సందర్భంగా ప్రధాన ఆల య ప్రాంగణంలో, పార్కిం గ్ ప్రదేశాల్లో, ఆలయంలోకి వచ్చివెళ్లే దారులు,క్యూ లైన్ల లో, కళ్యాణ కట్ట, ధర్మ గుండం, ఆలయ ప్రాంగణంలో చేస్తున్న ఏర్పాట్లను పోలీస్,ఆలయఅధికారులతో కలిసి గురువారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి 27వ వరకు నిర్వహించనున్న మహా శివ రాత్రి జాతర వేడుకలలో గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పకడ్బందీగా జాతర ఏర్పాట్లను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. పార్కింగ్ ప్రదేశాల్లో విధులలో ఉన్న సిబ్బందికి టెంట్ మంచి నీటి సదుపాయలు కల్పించాలన్నారు. ట్రాఫిక్ డైవర్షన్ల వద్ద సూచిక బోర్డ్స్, ఫ్లెక్సీలు ఏర్పాటు చేయాలని సూచించారు.

# 36మంది విశిష్ట వయోధిక మహిళలకు సన్మానాలు



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ జగిత్యాల జిల్లా శాఖ ఆధ్వర్యంలో జాతీయ మహిళా దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.గురువారం అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఈ వేడుకల్లో జిల్లాలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలు అందించిన కందునూరి అనసూర్య,దేవేంద్రమ్మ,బాలక్ష్మి, బోబ్బాటి కరుణ,ఏ.విజయ లక్ష్మి ,సంధ్య,అనసూయ, హేమ లత,,ప్రభావతి,తదితర 36 మంది విశిష్ట వయోధిక మహిళలను తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ,జగిత్యాల జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,అసోసియేషన్ ప్రతినిధులు ఘనంగా పట్టు శాలువాలతో,మెమోంటోలతోసన్మానించారు. మహిళల హక్కులు, భాధ్యతలు అంశంపై, వయో వృద్ధుల సంరక్షణ చట్టం పై హరి ఆశోక్ కుమార్ అవగాహన కల్పించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ అల్ సీనియర్ సిటీజేన్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి,జిల్లా అధ్యక్షుడు హరి ఆశోక్ కుమార్,ప్రధాన కార్యదర్శి గౌరిశెట్టి విశ్వనాథం, ఉపాధ్యక్షులు బొల్లంవిజయ్, పి.సి.హన్మంతరెడ్డి, ఎం.డి. యాకూబ్, కోశాధికారి వెలుముల ప్రకాష్‌రావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు పి.ఆశోక్‌రావ్, కె. సత్యనారాయణ, నాయకులు దిండిగాల విట్టల్, గద్దం మారుతి, కుంటాల కిషన్, కొక్కుల నారాయణ,వేముల దేవరాజం, ఉప్పుగళ్ల మురళీధర్, దేవేందర్‌రావు, ఎం.డి యాసూఫ్, ఎక్బాల్, కొండాపూర్ యాకూబ్ హుస్సేన్, దేవేందర్‌రావు, కోరుట్ల అధ్యక్షుడు పబ్బా శివానందం, మెట్‌పల్లి అధ్యక్షుడు బుచ్చిరెడ్డి,కోశాధికారి వెల్ముల ప్రభాకర్ రావు,ధర్మపురి అధ్యక్షుడు కండ్లే గంగాధర్, మహిళా ప్రతినిధులు కరుణ, బైరి రాధ, తదితరులు పాల్గొన్నారు.

## పన్నెండు గంటలు పారాయణం చేసిన కల్యాణి



ప్రజాపక్షం/జగిత్యాల ప్రతినిధి : పన్నెండు గంటలపాటు ఏకదాటిగా అఖండ లలితామాత సహస్రనామ స్తోత్ర పారాయణం చేసిన సుహాసిని వుటూరి కళ్యాణిని పలువురు అధ్యాత్మికులు అభినందించారు. జగిత్యాల రూరల్ మండలం పొలాసలోని 108 శ్రీ చక్ర సహిత లలితామాత దేవాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా జగిత్యాల పట్టణానికి చెందిన ఉటూరి కళ్యాణి ఉదయం 8 గంటల నుండి రాత్రి 8 గంటల వరకు ఆశేష భక్తుల సమక్షంలో లలితా మాత సహస్ర నామ పారాయణం చేసి అందరితో శభాష్ అనిపించుకుంది.కళ్యాణి 12 గంటల పాటు చేసిన సహస్ర నామ పారాయణం హాజరైన భక్తులను భక్తి పారవశ్యంలో ముంచారని కొనియాడారు.పొలాస ఆలయ పౌండర్ ట్రస్ట్ చైర్మన్ చెల్లం స్వరూప సత్తయ్య గురువారం అభినందించి కళ్యాని కి అమ్మవారి వస్త్రాలు సమర్పించి భవిష్యత్‌లో మరింత ఉన్నతంగా అమ్మవారి సేవలో పునీతం కావాలని ఆశీర్వధించారు.అలాగే కళ్యాణి ని జగిత్యాల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు ఎన్నం కిషన్ రెడ్డి, సుహాసినులు పాంపట్టి సులోచన, పెద్ది అశ్విని, చింత రోజా, బొద్దు వనిత, రుచిత, గోపతి స్వప్న, చెట్ల జానకి,దీప,అర్చన, వనజ అభినందనలు తెలిపారు.

## నిమ్మతి లింగయ్యకు నివాళి

ప్రజాపక్షం/ముత్తారం : పెద్దపల్లి జిల్లా మంథని నియోజకవర్గంలోని ముత్తారం మండలంలోని అడవి శ్రీరాంపూర్ గ్రామానికి చెందిన నిమ్మతి లింగయ్య అనారోగ్యంతో మరణించారు. ఈ విషయం తెలిసిన మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు గురువారం మృతుడి నివాసానికి వెళ్లి లింగయ్య మృత దేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మృతుడి కుమారులు నిమ్మతి ఆశాలు, రాజేందర్ లను ఓదార్చి వారి తండ్రి మరణం గురించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.అనంతరం జరిగిన అంతిమయాత్రలో బిఆర్‌ఎస్ నాయకులు మాజీ వైస్ ఎంపీపీ రవీందర్ రావు,సర్పంచ్ ల ఫోరం మండల మాజీ అధ్యక్షుడు నునె కుమార్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ నాంసాని సమ్మయ్య,బిఆర్‌ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు నిమ్మతి రమేష్, తో పాటు దుబాసి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిడిఓగా నరేష్



ప్రజాపక్షం/వెల్గటూర్: ఇంతకుముందు ఉన్న ఎంపీడీవో గాజుల శ్రీనివాస్ సెలవుపై వెళ్లగా జగిత్యాల జిల్లా ఎండపల్లి మండల నూతన ఎంపీడీవోగా ఉప్పరవెల్లి నరేష్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ధర్మపురి ఎంపీవో గా విధులు నిర్వహిస్తున్న నరేష్ ఇప్పుడు ఇంచార్జి ఎంపీడీవోగా బాధ్యతలు స్వీకరించారు. ఎండపెల్లి కి రావడం సంతోషంగా ఉందని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## చికిత్స తీసుకుంటే అంగవైకల్యం రాదు



ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్ : కుష్టు వ్యాధి అనేది ఒక సాధారణ జబ్బు అని తగిన సమయంలో గుర్తించి చికిత్స చేసుకుంటే అంగవైకల్యం రాదని జిల్లా వైద్యా శాఖ అధికారి డాక్టర్ జి అన్న ప్రసన్నకుమారి అన్నారు. జాతీయ కుష్టు వ్యాధి నిర్మూలనలో భాగంగా మహాత్మా గాంధీ వర్ధంతి రోజైనా జనవరి 30 నుండి ఫిబ్రవరి 13 వరకు అవగాహన పక్షోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, అందులో భాగంగా గురువారం రోజున జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, డాక్టర్ జి అన్నా ప్రసన్న కుమారి ఆధ్వర్యంలో పిహెచ్‌సి ముత్తారంలో కుష్టు వ్యాధి అవగాహన పక్షోత్సవాల చివరి రోజు కార్యక్రమును జరుపుకోవడం జరిగినది. పిహెచ్ సి పరిధిలోని కుష్టు వ్యాధిగ్రస్తులకు చెద్దర్లు, బెడ్ షీట్స్,పండ్లు పంపిణీ చేశారు.కుష్టు వ్యాధిపై జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి, డాక్టర్ జి.అన్నా ప్రసన్నకుమారి మాట్లాడుతూ కుష్టు వ్యాధి అనేది సామాన్యమైన అంటువ్యాధి, ఇది బహుళ ఔషధ చికిత్స ద్వారా పూర్తిగా నయం అవుతుంది. ఈ వ్యాధి మైకో బాక్టీరియం లేప్ర అనే బ్యాక్టీరియా ద్వారా వ్యాప్తి చెందే వ్యాధి. ఈ వ్యాధిని త్వరగా గుర్తించినట్లైతే అంగవైకల్యం రాకుండా నివారించవచ్చు. ఈ వ్యాధి యొక్క లక్షణాలు చర్మం పైన స్పర్శ లేనటువంటి రాగి రంగులో లేదా గోధుమ రంగులో పాలిపోయిన ,మొద్దుబారిన మచ్చలు. ఇవి ఉన్నట్లయితే అనుమానించి దగ్గరలో ఉన్న ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో సంప్రదించవలెను. వ్యాధి శాపము, పాపము ద్వారా రాదు మరియు వంశ పారంపర్యంగా కూడా రాదుఅన్నారు. లెప్రసీ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ రెడ్డి,ఇతర ప్రోగ్రామ్ ఆఫీసర్స్ డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ కిరణ్ కుమార్ మరియు పి.హెచ్. సి. మెడికల్ ఆఫీసర్ డాక్టర్ అమరేందర్ రావు, డిపిఎమ్‌ఓలు సువార్త, రమేష్, దేవి సింగ్ మరియు పీహెచ్సీ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## అదుపుతప్పి ఇసుక లారీ బోల్తా



ప్రజాపక్షం/ముత్తారం :పెద్దపల్లి జిల్లా ముత్తారం మండలంలోని జిల్లెలపల్లి పంచాయతీ పరిధిలో తాడిచర్ల బ్లాక్ 1 ఇసుక క్వారీ నుంచి ఇసుక లోడ్‌తో వెళ్తున్న లారీ జిల్లెల పల్లి మూలమలుపు వద్ద గురువారం అదుపు తప్పి లారీ బోల్తా పడింది. లారీ ఇసుక లోడ్‌తో వస్తున్న క్రమంలో లారీ అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ఘటనలో ఎవరికి ఏమి కాలేదు. ఇసుక లారీ బోల్తా పడటంతో రాకపోక లకు ఇబ్బంది ఏర్పడింది.

# సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించాలి



ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి : గ్రామ పంచాయతీ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ బాధ్యతలను పారదర్శకంగా నిర్వర్తించాలని డిపివో, నోడల్ అధికారి శేషాద్రి సూచించారు. జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రిటర్నింగ్ సహాయ అధికారులు, ఎంపిడివోలు, ఎంపివోలకు పంచాయతీ ఎన్నికల నిర్వహణపై గురువారం శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు. డిపివో, నోడల్ అధికారి శేషాద్రి మాట్లాడారు. ఎన్నికల నియమ నిబంధనల గురించి స్పష్టమైన అవగాహన ఉన్నప్పుడే పొరపాట్లకు ఆస్కారం ఉండని స్పష్టం చేశారు. ఎన్నికల సంఘం ద్వారా అందించిన హ్యాండ్ బుక్( కర దీపిక)ను చదువుకుని సజావుగా ఎన్నికలు జరిగేలా కృషి చేయాలని ఆదేశించారు. ఏ సందేహాలు ఉన్నా, అధికారులను అడిగి నివృత్తి చేసుకోవాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు అనువుగా ఉండే గ్రామ పంచాయతీ కార్యాలయాన్ని ముందుగానే ఎంపిక చేసుకుని, నామినేషన్ల స్వీకరణ, స్కూటీని, ఉపసంహరణ ప్రక్రియలను ఈసి మార్గదర్శకాలకు అనుగుణంగా రిటర్నింగ్ అధికారులు తమ స్వీయ పర్యవేక్షణలో నిర్వహించాలని సూచించారు. సమయ పాలనను పక్కాగా పాటిస్తూ నామినేషన్ల స్వీకరణ కేంద్రం గదిలో తప్పనిసరిగా గోడ గడియారం అందుబాటులో ఉండేలా చూసుకోవాలన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి. ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి. అందుకు గల కారణాలను ఏమిటి అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందన్నారు. ఎలా ంటి ఆక్షేపణలు తావులేకుండా పూర్తి పాదర్శకంగా ఎన్నికలను నిర్వహణ బాధ్యతలను నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఆర్‌వోలు 194 మంది, ఏఆర్‌వోలు 75 మంది, ఎంపిడివోలు,ఎంపివోలు శిక్షణకు హజరయ్యారు. డిఎల్ పివో నరేష్, మాస్టర్ ట్రైనర్లు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాల పెంపునకు వినతి

ప్రజాపక్షం/రామగిరి: పెద్దపల్లి జిల్లా కమాన్‌పూర్ మండలం గుండారం, కమాన్ పూర్ గ్రామాలలో ఓటర్లు అధికంగా ఉన్నందున కమాన్‌పూర్‌లో మరో రెండు, గుండారం లో మరో రెండు పోలింగ్ కేంద్రాలను పెంచాలని మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంపిడీవో లత, తహసిల్దార్ వాసంతికి గురువారం బిజెపి మండల ప్రధాన కార్యదర్శి మల్లారపు అరుణ్ కుమార్ వినతి పత్రం అందజేశారు. పోలింగ్ కేంద్రాల పరిధిలో 700 కి పైగా ఓటర్లు ఉంటే ఓట్లు వేసే క్రమంలో సమయం ఎక్కువగా పడుతుందని కావున మరో నాలుగు కేంద్రాలు పెంచితే ఓటర్లకు త్వరగా ఓటు వేసేందుకు అవకాశం కల్పించడం జరుగుతుందని మల్లారపు అరుణ్ వినతి పత్రంలో పేర్కొన్నారు.

# ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలి: ఎమ్మెల్యే

**ప్రజాపక్షం/బైంసా :** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపే ధ్యేయంగా పనిచేయాలని ఎమ్మెల్యే పవార్ రామరావ్ పటేల్ సూచించారు.గురువారం బైంసా పట్టణ,మండల,ఎమ్మెల్సీ ఎన్నికల ఇన్చార్జిలతో,కార్యకర్తలతో సమావేశాన్ని ఏర్పాటుచేసిన సందర్భంగా ఆయన మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి వాగ్దానాలు నెరవేర్చకుండా కాలయాపన చేస్తున్నారన్నారు.ఉపాధ్యాయ రంగ సమస్యలు పరిష్కరించడం లేదన్నారు.సంవత్సర కాలంలోనే రేవంత్ రెడ్డి పై ప్రజా వ్యతిరేకత ప్రారంభమైందంటే,ప్రభుత్వ నిర్లక్ష్య ధోరణి అద్దం పడుతుందన్నారు.ప్రధానమంత్రి నరేంద్ర మోడీ హయంలో దేశం సుభిక్షంగా ఉందని,ఢిల్లీ ఎన్నికల్లో ప్రజలు చారిత్రాత్మక తీర్పునిచ్చారన్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాజపా విజయం ఖాయమని,రానున్న రోజుల్లో తెలంగాణలో బిజెపి విజయ దంక మోగించి,ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని ధీమా వ్యక్తం చేశారు.నాయకులు,కార్యకర్తలు పట్టభద్రుల వద్దకు వెళ్లి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను,వివరించాలన్నారు.ఇన్చార్జిలు కష్టపడి,అనుకున్న లక్ష్యాన్ని నెరవేర్చుకొని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజిరెడ్డి,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కొమురయ్యకు భారీ మెజార్టీతో విజయ సాధించేలా పాటుపడాలన్నారు.కార్యక్రమంలో పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నియోజక వర్గ ఇంచార్జ్ హరి నాయక్,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల నియోజకవర్గ ఇన్చార్జ్ శివ చంద్రగిరి,బిజెపి పట్టణ అధ్యక్షుడు ఎనుపోతుల మల్లేష్,మండల అధ్యక్షురాలు సిరం సుస్మారెడ్డి,తాజా మాజీ కౌన్సిలర్లు,మాజీ సర్పంచ్ లు,నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# సినీ ఫక్కీలో కారులోంచి రెండు లక్షలు చోరీ చేసిన గుర్తు తెలియని వ్యక్తులు




**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ మండలం ఇబ్రహీంపేట్ తాండా గ్రామానికి చెందిన చందర్ రెండురోజుల క్రితం బాన్సువాడ ఎస్‌బిఐ బ్యాంకులో రెండు లక్షలు డ్రా చేసి కారులో పెట్టుకున్నారు. కారులో కొబ్బరి కాయలు కొందామని కారు పార్కుచేసి కొబ్బరికాయల దుకాణానికి వెళ్లగా బ్యాంకు నుండి కారును గమనించిన గుర్తు తెలియని వ్యక్తులు కారులోని నగదును ఎత్తుకెళ్లడంతో బాధితుడు స్తానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి పోలీసుల సిసి ఫుటేజీ ఆధారంగా దర్యాప్తు చేస్తున్నట్టు పట్టణ సిఐ మండల అశోక్ తెలిపారు.

# అంతర్జాతీయ సదస్సుకు అందె జీవన్‌రావు



**ప్రజాపక్షం/ఆర్మూర్ :** ఈనెల 15,16 తేదీలలో ఇంటర్నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్, ఫిట్‌నెస్, అండ్ స్పోర్ట్స్ సైన్స్ అసోసియేషన్, ఇండియా ఆధ్వర్యంలో హైదరాబాదులో నిర్వహించబడే ఇంటర్నేషనల్ కాన్ఫరెన్సు ఆన్ ఫిజికల్ ఎడ్యుకేషన్ 2025లో సూపర్ బ్రెయిన్ యోగా ఫర్ లీవరేజింగ్ స్ట్రెంగ్త్, బ్యాలన్స్, ఫ్లెక్షబిలిటి అండ్ వెల్ బీయింగ్ ఇన్ స్పోర్ట్స్ అనే అంశంపై అందె జీవన్‌రావు తన పరిశోధనా పత్రాన్ని సమర్పించి ప్రసంగించనున్నారు. ఆర్మూర్ బాలుర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సూపర్ బ్రెయిన్ యోగ అంశంపై కార్యశాల నిర్వహించిన సందర్భంగా రాష్ట్ర అవార్డు గ్రహీత, ఇటీవల గుంజీళ్ళ మాస్టారుగా పేరొందిన అందె జీవన్‌రావును పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమేష్, ఫిజికల్ డైరెక్టర్, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జనరల్ సెక్రెటరీ మల్లేశ్ గౌడ్, ఉపాధ్యాయ సిబ్బంది శోభారాణి, రాజేందర్, మున్వర్, అస్రా నౌషిన్ తదితరులు ఘనంగా సన్మానించారు. నిజామాబాద్ జిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం జనరల్ సెక్రెటరీ మల్లేశ్ గౌడ్ మాట్లాడుతూ పదవి విరమణ అనంతరం కూడా సూపర్ బ్రెయిన్ యోగా వంటి విభిన్న అంశాలపై పరిశోధనలు చేయడం అభినందనీయమన్నారు. పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు భూమేశ్ మాట్లాడుతూ ఇలాంటి పరిశోదనల వలన విద్యార్థులకు మేలు కలుగుతుందన్నారు.

# పెర్కిట్‌లో ఆనంద్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రి ప్రారంభం




**ప్రజాపక్షం/ఆర్మూర్ :** మునిసిపల్ పరిధిలోని పెర్కిట్ బస్టాండ్ ఎదురుగా నూతనంగా నిర్మించిన ఆనంద్ మల్టీ స్పెషాలిటి ఆసుపత్రిని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ అప్పాల ఆనంద్‌రెడ్డితో కలిసి ఆర్మూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పొద్దుటూరు వినయ్ కుమార్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డిలు వేరువేరుగా గురువారం ప్రారంభించారు. అధునాతన సౌకర్యాలతో ఆర్మూర్ డివిజన్‌లోని ప్రజలకు వైద్య సేవలు అందించడానికి ఆసుపత్రిని నిర్మించామని తెలిపారు. ఆర్మూర్ ప్రాంత వాసులు ఆసుపత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని వారు ప్రజలను కోరారు. ఆసుపత్రి ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఉర్దూ అకాడమి రాష్ట్ర ఛైర్మన్ తాహెర్ బిన్ హందాన్, సహకార శాఖ రాష్ట్ర ఛైర్మన్ మానాల మోహన్ రెడ్డి, బాజిరెడ్డి గోవర్ధన్, మాజీ కార్పొరేసన్ ఛైర్మన్ డాక్టర్ మదుశేఖర్, ప్రముఖ చార్టెడ్ అకౌంటెంట్ ఈరవత్రి రాజశేఖర్, ఆసుపత్రి వైద్యులు అరుణ్ రెడ్డి, పూజా రెడ్డి, యమునా రెడ్డి, అప్పాల సంతోష్ రెడ్డి, సునీత రెడ్డి, అనిల్ రెడ్డి, వైద్యులు శరణ్యరెడ్డి, ఐశ్వర్య రెడ్డి, భరత్ సింహారెడ్డి, అక్షయ రెడ్డి, అక్షిత్ రెడ్డి, అర్నిక రెడ్డి, మాజీ కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు, మాజీ ఎంపిటిసి సభ్యులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ




**ప్రజాపక్షం/నందిపేట్ :** నందిపేట్ మండలంలోని కొండూరు, ఆంధ్రనగర్ గ్రామాలలో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను బాధితులకు కాంగ్రెస్ నాయకులు అందజేశారు. కొండూరు గ్రామానికి చెందిన బోండ్ల సుజాత ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం 32 వేలు, ఆంద్రనగర్ గ్రామానికి చెందిన సుమతి కి 60 వేల చెక్కును గురువారం మండల కాంగ్రెస్ అధ్యక్షులు మంద మహిపాల్, డిసిసి డెలిగేట్ దేవిదాస్ గౌడ్, సంజీవ్, అడవి రాము, దమ్మాయి శ్రీను, చిన్నయ్య, నారాయణ, పోశెట్టి తదితరులు పాల్గొన్నారు.

# రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ ఇద్దరు ఐరన్‌లెగ్



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** రేవంత్‌రెడ్డి రాహుల్‌గాంధీ ఇద్దరు ఐరన్‌లెగ్‌లని రేవంత్‌రెడ్డి ముప్పయి సార్లు ఢిల్లీ వెళ్లిన రాహుల్‌గాంధీ అపాయింట్ ఇవ్వలేదని బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు మాజీ ఆర్మూర్ ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి అన్నారు. గురువారం నగరంలోని బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం అన్ని రీ సర్వేలు, రీ ఎలక్షన్ నిర్వహించాలని ప్రజలు కోరుతున్నారన్నారు. ఇటీవల జరిగిన ఎన్నికలలో కాంగ్రెస్‌కు గుండు సున్నా వచ్చిందని గుర్తు చేశారు. కేసీఆర్ సార్ కావలి, కేసీఆర్ సర్కార్ రావలని ప్రజలు కోరుకుంటున్నారన్నారు. అన్నింటిలో రీసర్వే నిర్వహించే కాంగ్రెస్ ప్రభుత్వం రీ ఎలక్షన కూడా నిర్వహిస్తే బాగుంటుందని హితవు పలికారు. రాహుల్‌గాంధీకి రేవంత్ మొహం చూడటం కూడా ఇష్టం లేదన్నారు. ఈ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు వచ్చినా బీఆర్‌ఎస్ పార్టీకి ప్రజలు పట్టం కడుతారన్నారు. సుస్థిర పాలన కేసీఆర్ ఇస్తే అస్థిర పాలన రేవంత్‌రెడ్డి ఇస్తున్నారన్నారు. సిఎంను రాష్ట్రంలో ఉద్దెర బెరకాడని ప్రజలు పిలుచుకుంటున్నారని, అన్ని పథకాలు కూడా ఇప్పుడు అప్పుడంటూ మభ్యపెడుతున్నారన్నారు. రుణమాఫీ, భరోసా ఇప్పుడు ఇస్తామప్పుడు ఇస్తామంటూ కాలయాపన చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ హయాంలో హామీలో లేని పథకాలు అమలు చేసి ప్రజలకు మేలు చేశామని, కాంగ్రెస్ మాత్రం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కటి కూడా నెరవేర్చటం లేదన్నారు. రాష్ట్రాన్ని కుక్కలు చింపిన విస్తరిలా మార్చారని స్థానిక ఎన్నికల కోసం ఓట్ల కోసం బిచ్చగాళ్లలా సిద్ధమవుతున్నారని 6 గ్యారెంటీలు అమలు చేసిన తర్వాతనే ఓట్లు అడగాలని విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాంకిషన్‌రావు, మాజీ నుడా చైర్మన ప్రభాకర్‌రెడ్డి, సూదం రవిచందర్, తెలంగాణ శంకర్, చింతకాయల రాజు, శేఖర్ రాజ్ పాల్గొన్నారు.

# ప్రమాద బిమా చెక్కు అందజేత



**ప్రజాపక్షం / ధర్మపురి:** జగిత్యాల జిల్లా ధర్మపురి ప్రాథసాయ సహకార సంఘంలో సభ్యురాలైన మద్దునూర్ గ్రామానికి చెందిన బండారి చిన్న సత్తెమ్మ ప్రమాదవశాత్తు విద్యుత్‌ఘాతంతో మృతి చెందగా నేషనల్ ఇన్సురెన్స్ ద్వారా వచ్చిన ప్రమాద భీమా రూ.లు ఒక లక్ష చెక్కును గురువారం సంఘం అధ్యక్షులు డా. ఎల్లాల శ్రీకాంత్ రెడ్డి మృతురాలి కుమారుడు లక్ష్మ ణ్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ డైరెక్టర్ పెరుమాండ్ల ఎల్లాగౌడ్, కేడిసిసి బ్యాంక్ మేనేజర్ శ్రీ లక్ష్మి, ఫీల్డ్ ఆఫీసర్ ప్రవీణ్, సీఈవో అయ్యోరి రాజేష్ పాల్గొన్నారు.

# ఘనంగా మల్లన్న స్వామి రథోత్సవం



**ప్రజాపక్షం/మల్లాపూర్:** మండలంలోని రత్నాపూర్ గ్రామంలోని మల్లన్న స్వామి ఆలయంలో జాతర ఉత్సవాలు రెండు రోజుల నుండి ఘనంగా జరుగుతున్నాయి. ఈ మేరకు రెండవ రోజు స్వామి వారి ఆలయ ప్రాంగణంలో రథోత్సవ కార్యక్రమాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. కాగా వేలాది సంఖ్యలో భక్తులు స్వామి వారి దర్శించుకుని మొక్కులను చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు భక్తులు పాల్గొన్నారు.

# బహిష్కరిస్తున్నామని ప్రకటనలు విడుదల చేయడం ఏంటి...?



**ప్రజాపక్షం / రాజన్న సిరిసిల్ల ప్రతినిధి:** ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్ష పదవికి, సంఘం ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా లేఖను చరవాణిలో జిల్లా కార్యదర్శికి పంపించినప్పటికి కావాలని జిల్లా నాయకత్వం తనపై తప్పుడు ఆరోపణలు చేస్తూ బహిష్కరించామనే పత్రిక ప్రకటనలను పూర్తిగా ఖండిస్తున్నామని ఎఐఎస్‌ఎఫ్ రాజన్న సిరిసిల్ల జిల్లా నాయకుడు కుర్ర రాకేష్ పేర్కొన్నారు. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా తనని ఎస్‌ఎఫ్‌ఐ నుండి బహిష్కరిస్తున్నామని వాట్సప్ గ్రూప్స్‌లో చాటింపు వేసుకుంటున్న నాయకులను చూస్తుంటే విద్యార్థి సంఘంలో వారి నాయకత్వ స్థాయి ఎంటో సిద్దాంతాలపై వాళ్లకు ఉన్న అవగాహన ఎంటో ఇక్కడ కొట్టొచ్చినట్లు కనిపిస్తుందన్నారు. రాజినామా చేసిన నన్ను బహిష్కరిస్తున్నామని చెప్పుకోవడం అంటే సంఘ నియమ నిబంధనలు తెలియని మూర్ఖులుగా వారిని పరిగణించాలని, సదరు నాయకులు, నాయకత్వం కొందరు వ్యక్తులు తప్పుడు నిర్ణయాలు, తీర్మాణాలు, నిర్మాణం, అకౌంట్స్ నిర్వహణ తప్పుల తడకగా ఉందని, కేవలం ఒక్క వ్యక్తికి అనుకూలంగా ఉండటం మూలంగా అనేక సార్లు జిల్లా ఆఫీస్ బేరర్స్ సమావేశాల్లో చర్చకు పెడితే విషయాన్ని పూర్తిగా తోసిపుచ్చడంతో ఎన్నోసార్లు సంఘం కోసమే ఓపిగ్గా ఉన్నానని తెలిపారు. నేను వ్యక్తిగత నిర్ణయంతో సంఘం నుండి బయటకు వచ్చానని, దాన్ని జీర్ణించుకోలేక బయట నేను మరో బలమైన క్రియాశీలక సంఘం నిర్మాణం చేయగలననే, నా పేరు చెడగొట్టడం కోసం ఇలాంటి నీచపు కార్యక్రమాలు చేస్తున్నారని తెలిపారు.

# ప్రజల పక్షాన ప్రశ్నించే గొంతుక కావాలంటే బిజెపిని గెలిపించండి

**ప్రజాపక్షం/మంచిర్యాల టౌన్ :** త్వరలో జరుగనున్న పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలకు ప్రశ్నించే గొంతుక కావాలంటే బిజెపి అభ్యర్థిని గెలిపించాలని బిజెపి పార్టీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, పాల్వాయి హరీష్ పిలుపునిచ్చారు. గురువారం మంచిర్యాల జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా స్థాయి ఎమ్మెల్సీ ఎన్నికల వర్క్‌షాప్‌కు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అంతకుముందు మంచిర్యాల ఐబి చౌరస్తా నుండి కార్యకర్తలు, నాయకులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, బిజెపి అభ్యర్థులను గెలిపిస్తే ఉద్యోగులు, నిరుద్యోగ యువత, ఉపాధ్యాయుల పక్షాన ప్రశ్నించే గొంతుక అవుతారని అన్నారు. ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు ఎలాంటి ప్రయోజనం లేదని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయి ఎన్నికల సమయంలో నిరుద్యోగులకు ఇచ్చిన నిరుద్యోగభృతి, రెండు లక్షల ఉద్యోగాలు ఇవ్వకుండా యువతను మోసం చేసారని ఆరోపించారు. మరోవైపు ఉద్యోగులకు, ఉపాధ్యాయులకు డిఎ, పిఆర్‌సి , పెండింగ్ బకాయిలు చెల్లించకుండా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేశారని ఆరోపించారు. సమగ్ర శిక్ష అభియాన్ ఉద్యోగులకు , కాంటాక్టు టీచర్లను అధికారంలోకి వచ్చిన వెంటనే రెగ్యులరైజ్ చేస్తామని హామీ ఇచ్చి ఇప్పటి వరకు ఇచ్చిన హామీ నెరవేర్చకుండా మోసం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను పట్టభద్రపులు, ఉపాధ్యాయులు ఎండగట్టి ఎంఎల్‌సి ఎన్నికల్లో బిజెపి అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నగునూరి వెంకటేశ్వర్ గౌడ్, మాజీ జిల్లా అధ్యక్షుడు వెరబెల్లి రఘునాథ్, నాయకులు ముల్కల్ల మల్లారెడ్డి, రావుల రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

# సంత్ సేవలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా సెలవుగా ప్రకటించాలి



**ప్రజాపక్షం/నిజామాబాద్ ప్రతినిధి:** దేశంలో 15 కోట్ల జనాభా కలిగి ఉన్న బంజారా గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవలాల్ మహారాజ్ జయంతిని సెలవుగా ప్రకటించాలని మాజీ ఉపసర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్.బాలునాయక్ అన్నారు. బంజారాల సమాజాభివృద్ధికి చైతన్యానికి బంజారా బిడ్డలను భక్తి మార్గంలో నడిపించేలా చెడు అలవాట్లకు దూరంగా ఉండేలా కృసి చేసిన సంత్ సేవలాల్ మహారాజ్ జయంతిని కేంద్ర ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించి పండగను గొప్పగా జరుపుకునేలా చూడాలని కోరారు. గతంలో పార్లమెంట్‌లో సేవలాల్ మహారాజ్ జయంతిపై మాట్లాడిన ఎంపీ ధర్మపురి అరవింద్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలుపుతున్నామన్నారు. రాష్ట్రంలో 50లక్షల జనాభాబంజారా గిరిజనులున్నారని, సెలవు లేకపోవటంతో ఉద్యోగులు విద్యార్థులు పండగకు దూరమవుతున్నారన్నారు.

# బ్యాంకు లావాదేవీల పై అవగాహన సదస్సు



**ప్రజాపక్షం/ తాండూర్:** తాండూరు మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో గురువారం సెంటర్ ఆఫ్ ఫైనాన్స్ లిటరెస్ లో భాగంగా నేషనల్ సెంట్రల్ ఫర్ ఫైనాన్స్ ఎడ్యుకేషన్(ఎన్‌సిఎఫ్ఇ) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా తాండూరు తెలంగాణ గ్రామీణ బ్యాంకు మేనేజర్ ఇందాల్ హాజరయ్యారు .ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు లావాదేవీలు, ఆన్ లైన్ మోసాలు, బ్యాంకులో ఉన్నటువంటి అనేక రకాలైనటువంటి రుణాలపై, విద్యార్థిని విద్యార్థులకు సంబంధించిన విద్యాలక్ష్మి పోర్టల్ వంటి విషయాలపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని ఆయన అన్నారు. అనంతరం ఈ కార్యక్రమం లో పాల్గొన్న ఎన్‌సిఎఫ్ఇ కౌన్సిలర్ ఎన్నాం అశోక్ విద్యార్థిని విద్యార్థులకు బ్యాంకులో ఖాతాదారులకు ఉండే వివిధ రకాలైన ఖాతాలకు, విద్యార్థిని విద్యార్థులకు చదువులకు సంబంధించి బ్యాంకు ద్వారా వచ్చే రుణాలు గురించి, ఆన్లైన్ ద్వారా జరుగుతున్నటువంటి మోసాల పైన విద్యార్థినీ విద్యార్థులకు వీడియోల రూపంలో అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో కెజిబివి ఎస్‌హెచ్ఒ కవిత, సిఎఫ్ఎల్ కౌన్సిలర్ రవి, సత్యనారాయణ, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలి



**ప్రజాపక్షం/రెబ్బెన:** సింగరేణి సంస్థ నిర్దేశించిన లక్ష్యాలను అధిగమించాలని సింగరేణి చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ బలరాం అన్నారు. బుధవారం రాత్రి సింగరేణి డైరెక్టర్లు సూర్యనారాయణ, వెంకటేశ్వర్లతో కలిసి బెల్లంపల్లి ఏరియా సిహెచ్ పి, కైరిగూడ ఉపరితల గనులలో పర్యటించారు. ముందుగా గోలేటి సిహెచ్‌పికి చేరుకున్నారు. ఉద్యోగులు, కార్మికులు అధికారులు వారికి ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా సి అండ్ ఎండి ఉద్యోగులతో మాట్లాడుతూ సిహెచ్‌పి నిర్వాణ పాటిస్తున్న రక్షణ దూళి నియంత్రణ చర్యలను తెలుసుకొని ఉద్యోగులను అభినందించారు. ఎవన్ వ్యూహంతో కూడిన రక్షణ నియమాలు వివరించే సౌండ్ సిస్టం ను చూసి సిబ్బందిని ప్రశంసించారు. జాతీయ రహదారి ప్రక్కన ఉన్నప్పటికీ దుమ్ము ధూళి లేకుండా ఆదర్శంగా నిర్వహిస్తున్న తీరు నాటిన మొక్కలను వివరాలను తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏరియాకు నిర్దేశం నిర్దేశించుకున్న లక్ష్యాలను అధిగమించాలని కోరారు. అనంతరం కైరిగూడ ఉపరితల గణికి చేరుకున్నారు ఉద్యోగులు ఘనంగా స్వాగతం పలికారు. ఒసిలో చేపడుతున్న రక్షణ చర్యలు ఉత్పత్తి యంత్రాల వినియోగం ఉద్యోగులు సమిష్టి కృషిని తెలుసుకున్నారు. బెల్లంపల్లి ఏరియా ఉత్పత్తి లక్ష్యసాధనలో ముందుంటుందని బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్ ఉద్యోగులపై తనకు నమ్మకం ఉందని తెలిపారు. కార్మికుల అభిప్రాయాలు తెలుసుకున్నారు. మహిళా ఉద్యోగులు అన్ని డిజిగ్నేషన్ పనులు చేయడం తెలుసుకొని వారిని అభినందించారు. ప్రధానంగా దుమ్ము లేపకుండా తీసుకుంటున్న చర్యలు బాగున్నాయని చెప్పారు గత ఏడాదికన్నా ఈ ఆర్థిక సంవత్సరంలో లాభాలు ఎక్కువగా వస్తాయని చెప్పారు. ఉద్యోగుల ఉత్సాహాన్ని నింపారు.అధికారులు పర్యవేక్షణలకు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో బెల్లంపల్లి ఏరియా జనరల్ మేనేజర్ ఎం శ్రీనివాస్, ఎఐటియుసి బ్రాంచ్ కార్యదర్శి ఎస్ తిరుపతి, రాజమల్లు, నరేందర్‌తో పాటు వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

# మేధావి వర్గమా జర ఆలోచించు..




**ప్రజాపక్షం/నిర్మల్ రూరల్ :** ఉద్యమాలను పాతర పెట్టి పైరవీల పంథా ఎంచుకున్న బహు రూపులు తమనంటే తమను ఎమ్మెల్సీగా గెలిపించాలంటూ మేధావి వర్గానికి కన్ఫ్యూజ్ చేస్తున్నారు.ఉద్యమాలతో సంబంధం లేని వారు డబ్బు సంచులతో,వక్ర మార్గాలలో ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాన్ని కైవసం చేసుకోవడానికి రాత్రింబవళ్లు మేధావివర్గ ఓటరు మహాశయులను మచ్చిక చేసుకునేందుకు తిరుగుతున్నారు.ఇందులో రియల్ ఎస్టేట్ వ్యాపారులు,ప్రైవేట్ పాఠశాలల యజమానులు సైతం బరిలో దిగారు.ఇది వరకే ఐదు సంవత్సరాలు ఎమ్మెల్సీగా అవకాశం ఇస్తే ఉపాధ్యాయ లోకానికి ఏం ఒరుగపెట్టారని మళ్లీ దేహి అంటూ వస్తున్నారు.ఇలాంటి వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని విద్యారంగ,ఉపాధ్యాయ సమస్యల కోసం నిరంతరం పోరాటాలు చేస్తూ,నిజాయితీ,నిబద్ధతకు మారుపేరుగా నిలిచే తనను యూనియన్ల జండాలు,ఎజెండాలకు ప్రక్కన పెట్టి ఆత్మ ప్రబోధానుసారం ప్రథమ ప్రాధాన్యత ఓటు వేసి కరీంనగర్,మెదక్,అదిలాబాద్,నిజామాబాద్,ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మెల్సీగా గెలిపించాలని టిపిటిఎఫ్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి వై.అశోక్ కుమార్ విజ్ఞప్తి చేశారు.తనను గెలిపిస్తే సిపిఎస్ రద్దు చేయించి ఓ.పి.ఎస్ పునరుద్ధరణ చేయిస్తానని కేజీబీవీ ఉపాధ్యాయులకు సమ్మె కాలం వేతనం ఇప్పిస్తానని,కనీస వేతన అమలు చేయించేందుకు,పెండింగ్లో ఉన్న 4 వేల కోట్ల బకాయిలు,పదవీ విరమణ పొందిన వారి పెన్షనరీ బెనిఫిట్స్ ఇప్పించేందుకు శాయ శక్తుల కృషి చేస్తానని ఈ సందర్భంగా అశోక్ కుమార్ హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో టిపిటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు ఆరేపల్లి విజయకుమార్,టిఎస్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు దాసరి శంకర్,జిల్లా ప్రధాన కార్యదర్శి పెంట అశోక్,నాయకులు చల్లా గోవర్ధన్ రావు,ఎస్సీ,ఎస్టీ ఉపాధ్యాయ సంఘం నాయకులు బిక్షపతి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్న అధికారులు



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** సర్వర్ డౌన్ నేపంతో పత్తిని కొనుగోలు చేయక అధికారులు రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని సిపిఎం నాయకులు ఆరోపించారు. గురువారం కలెక్టరేట్ ఎదుట పత్తి కొనుగోలు చేయాలని రైతులు చేస్తున్న నిరసనకు సిపిఎం నాయకులు మద్దతు తెలిపారు. అనంతరం రైతులతో కలిసి అడిషనల్ కలెక్టర్ కి డేవిడ్ కు వినతి పత్రం అందజేశారు . ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్ లు మాట్లాడుతూ ఆసిఫాబాద్ లోని మార్కెటింగ్ అధికారులు, ప్రైవేటు వ్యాపారస్తులతో కుమ్ముక్కై పత్తి కొనుగోలు చేయక పలు కారణాలు చూపిస్తూ రైతులను ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. గత కొన్ని రోజుల నుండి ఇప్పటి వరకు సర్వర్ డౌన్ ఉందనే పేరుతో పత్తి కొనుగోలు నిలిపివేశారన్నారు. దీంతో కిరాయి వాహనాల్లో పత్తి తీసుకువచ్చిన రైతులు చాలా ఇబ్బంది పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ఎటువంటి షరతులు లేకుండా జిన్నింగ్ కు వచ్చిన పత్తిని కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. రైతులు పెంటయ్య, నితిన్, మహదు, గోపాల్, పోచన్న, సాయి కిరణ్, వెంకటేష్, వినోద్, ముస్తఫా, దత్తు తదితరులు పాల్గొన్నారు.

# బాధిత కుటుంబానికి నిత్యావసర సరుకులు అందజేసిన మాజీ జడ్పిటిసి



**ప్రజాపక్షం/బాన్సువాడ:** బాన్సువాడ మండలంలోని నాయక్ తండాలో అగ్ని ప్రమాదానికి నివాసపు గుడిసె కాలిపోవడంతో బాధిత కుటుంబానికి మాజీ జడ్పిటిసి హరిదాస్ నిత్యవసర సరుకులతో పాటు బియ్యాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# సిర్పూర్ టి దర్గా భూముల వేలంపాట వాయిదా

**ప్రజాపక్షం /సిర్పూర్ టి :** సిర్పూర్ టి మండల కేంద్రంలో ఉన్న హజ్రత్ సయ్యద్ తాలిబ్ అలీ షా బాబా దర్గా కు చెందిన భూములకు ఈ నెల 14న నిర్వహించే వేలంపాటను అనివార్య కారణాల వలన వాయిదా వేస్తున్నట్లు దర్గా అభివృద్ధి కమిటీ అధ్యక్షులు షేక్ సాలె బిన్ సయిద్ ఒక ప్రకటనలో తెలిపారు. తదుపరి వేలం తేదీని మళ్లీ ప్రకటిస్తామని ఆయన తెలిపారు. వివరాలకు 9550572163కు సంప్రదించాలని పేర్కొన్నారు.

# బాధిత కుటుంబానికి పరామర్శ..

**ప్రజాపక్షం/లక్ష్మణచందా:** లక్ష్మణచందా మండలంలో నపొట్టపెల్లి కే గ్రామ సర్పంచ్ ఉల్వాజీ రాజు తల్లి ఉల్వాజీ చంద్రవ్వ (68) ఇటీవల అనారోగ్యంతో మరణించారు.విషయం తెలిసిన మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి గురువారం బాధిత కుటుంబన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపి వారికి మనోధైర్యాన్ని అందించారు.ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా డీసీసీబీ వైస్ చైర్మన్ రఘునందన్ రెడ్డి,అల్లోల సురేందర్ రెడ్డి,ఎఫ్ఏసిఎస్ చైర్మన్ ధర్మాజీ రాజేందర్,నాలం శ్రీనివాస్ ,తదితరులు ఉన్నారు.

# లక్ష్యం నిర్దేశించుకుని చదువులో రాణించాలి

**ప్రజాపక్షం/ఎడపలి:** విద్యార్థులు లక్ష్యం నిర్దేశించుకొని చదువులో రాణించాలని తెలంగాణ గురుకుల పాఠశాలల రాష్ట్ర కార్యదర్శి రమణ కుమార్ సూచించారు. గురువారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండల కేంద్రంలోని బాలికల గురుకుల పాఠశాలను రమణ కుమార్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు వార్షిక పరీక్షల భయాన్ని విడిచి పెట్టాలని సూచించారు. ప్రభుత్వం రెసిడెన్షియల్ విద్యార్థులకు కాస్మోటిక్స్ ఛార్జీలు పెంచిందని, మౌళిక వసతుల కల్పనకు ఎన్నడూ లేనంతగా కృషి చేస్తుందని, ఉపాధ్యాయులు మంచి బోధన చేస్తుండటంతో.., దీనిని సద్వినియోగం చేసుకొని విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలని ఆయన కోరారు. రెసిడెన్షియల్ పాఠశాల ఆవరణలో కిచెన్ గార్డెన్ ను పరిశీలించి అభినందించారు. కిచెన్ గార్డెన్‌లో విద్యార్థులు బ్యాచుల వారిగా కూరగాయాలు పండిచండం అభినందనీయమన్నారు. నిజామాబాద్ డైట్ ప్రిన్సిపల్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. విద్యార్థులు సమయపాలన పాటించి, ఏకగ్రాతతో చదివి పరీక్షలో విజయం సాధించాలన్నారు. ప్రతిరోజు సబ్జెక్టుల వారిగా గమనం చేసుకోవాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలో అన్నీ వసతులు ఉన్నందున ఉపాధ్యాయులు పరీక్షలు అంటే విద్యార్థుల భయం పోగొట్టి అనుకూలమైన వాతావరణం తీసుకరావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ గంగా శంకర్, వైద్యులు వెంకట రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.

# రెండు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ప్రజాపక్షం/మోర్తాడ్:** నిజామాబాద్ జిల్లా మోర్తాడ్ మండలంలోని సుంకేట్ గ్రామంలో బుధవారం రాత్రి మోర్తాడ్ పోలీసులు ఎఎస్సై గోపాల్, కానిస్టేబుల్ వసంత్‌లు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా అనుమతి లేకుండా ఇసుక తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పట్టుకున్నారు. దీంతో ఈ రెండు ట్రాక్టర్లపై కేసులు నమోదు చేసినట్లు ఎస్సై బి.విక్రమ్ తెలిపారు. మోర్తాడ్ మండల పోలీస్ స్టేషన్ పరిధిలోని ఏ గ్రామం నుంచైనా అధికారుల అనుమతి లేకుండా ఇసుక తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా ఎస్సై విక్రమ్ హెచ్చరించారు.

# సరోజినీ నాయుడు జీవితం నేటి మహిళాలకు స్ఫూర్తిదాయకం..



**ప్రజాపక్షం/కడెం:** ప్రభుత్వ జూనియర్ కళాశాల కడెం నందు సరోజిని నాయుడు జయంతి,జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇన్చార్జి ప్రిన్సిపాల్ ఎన్.ప్రసాద్ కుమార్ సరోజినీ నాయుడు చిత్రపటానికి పులమాలవేసి విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తూ ప్రముఖ స్వాతంత్ర సమర యోధురాలు అఖిల భారత జాతీయ కాంగ్రెస్ మొట్ట మొదటి మహిళాధ్యక్షురాలు, స్వతంత్ర భారత మొట్టమొదటి మహిళా గవర్నర్ రచయిత్రి నైటింగేల్ ఆఫ్ ఇండియా సరోజినీ నాయుడు జీవితం నేటి మహిళా యువతకు స్ఫూర్తిదాయకమని అన్నారు. సరోజినీ నాయుడు తన 12 ఏటనే ఇంగ్లీషులో పద్య రచన చేయడం ప్రారంభించిందని ది గోల్డెన్ త్రెషోల్డ్,ది బర్డ్ ఆఫ్ టైం,ది బ్రోకెన్ వింగ్ లాంటి రచనలతో భారతీయ ఖ్యాతిని ప్రపంచ నలుమూలల విస్తరింప చేసిందని బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా జరిగిన స్వాతంత్ర ఉద్యమంలో ఆమె క్రియాశీలక పాత్ర పోషించిందని రౌలత్ చట్టం,శాసనలందనోద్యమం దండి సత్యాగ్రహం క్విట్ ఇండియా ఉద్యమం లాంటి మహా ఉద్యమాల్లో పాల్గొని అరెస్టు కాబడి జైలు జీవితం కూడా గడిపిందని మహిళలకు విద్య అవసరమని మహిళల్లో చైతన్యం నింపి మహిళాభివృద్ధికి కృషి చేసిందని అందుకే భారత ప్రభుత్వం ఆమె పుట్టిన రోజు ఫిబ్రవరి 13ను జాతీయ మహిళా దినోత్సవంగా ప్రకటించిందని తెలిపారు. జీవితమంతా మానవ సేవకు దేశ సేవకు అంకితం చేసిన గొప్ప దేశభక్తురాలు సరోజిని నాయుడు అని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శరణ్య, లక్ష్మీ రాజం, రజిత, రాజు, సీనియర్ అసిస్టెంట్ రవీందర్, విద్యార్థులు పాల్గొన్నారు.

## స్థానిక ఎలక్షన్లకు అన్ని సిద్ధం



**ప్రజాపక్షం/ఖానాపూర్ :** స్థానిక ఎలక్షన్ల శిక్షణ కార్యక్రమం ఖానాపూర్ పట్టణం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించడం జరిగింది. గురువారం జరిగిన ఈ కార్యక్రమానికి జిల్లా డీపీవో అధికారి రమేష్ మాట్లాడుతూ ఎలక్షన నిర్వహించే విధానాన్ని, అధికారులకు తెలియజేశారు. ఓటు వేసే విధానాన్ని ప్రజలకు వివరించి చెప్పాలని ఎలక్షన్ సామాగ్రి ఆయా మండలాలకు వచ్చినందుకు, వాటి పర్యవేక్షణ బాధ్యతలు, అలాగే గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలు సరైన సౌకర్యాలు ఉన్నాయో లేదో పర్యవేక్షించుకోవాలని, సమస్యాత్మక కేంద్రాలను ముందుగానే రిటర్నింగ్ అధికారికి తెలియజేయాలని, వివరించారు. ఈ కార్యక్రమానికి ఖానాపూర్ ఎంపీడీవో సునీత, ఎంపివో రత్నాకర్ రావు, ఎంఈఓ ప్రేమ్ సాగర్, పెంబి, దస్తురాబాద్, కడెం, మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఎంపీఓలు, డీపీఓలు, పంచాయతీ సెక్రెటరీలు, ఆయా పాఠశాల ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

## ఇసుక డంపుల సీజ్

**ప్రజాపక్షం/కోటగిరి:** నిజామాబాద్ జిల్లా పోతంగల్ మండలంలోని కొడిచర్ల గ్రామ శివారులో ఉన్న ఇసుక డంపులను రెవెన్యూ అధికారులు గురువారం సీజ్ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ గంగాధర్ మాట్లాడుతూ.. అక్రమంగా ఏర్పాటు చేసిన ఇసుక డంపుల విషయం తమ దృష్టికి రావడంతో వెంటనే అక్కడికి వెళ్లి పరిశీలించామన్నారు. సుమారు 38ట్రాక్టర్ల ఇసుకను సీజ్ చేసినట్లు తహసీల్దార్ తెలిపారు. డీడీ కట్టిన వారికి ప్రభుత్వ పనుల కోసం ఇసుకను కేటాయిస్తామన్నారు. ఎవరైనా అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు తప్పవని ఈ సందర్భంగా తహసీల్దార్ గంగాధర్ హెచ్చరించారు.

## సాధారణ ఎన్నికలపై సమీక్ష సమావేశం



**ప్రజాపక్షం/పెంచికలపేట్ :** పెంచికలపేట్ మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల అభివృద్ధి అధికారి (ఎంపిడిఒ) అల్బర్ట్ అధ్యక్షతన రాబోయే సాధారణ ఎన్నికల ఏర్పాట్లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో బిజెపి మండల అధ్యక్షుడు కుకుడే రాజేశ్వర్, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బిట్టి శ్రీనివాస్, కాంగ్రెస్ పార్టీ నాయకుడు లచ్చన్న, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ, 2025లో జరగనున్న ఎంపిటిసి, జడ్పిటిసి సాధారణ ఎన్నికలకు సంబంధించి మండలంలో ఐదు ఎంపిటిసి, జడ్పిటిసి స్థానాలకు మొత్తం 24 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇందులో కొండపల్లి ఎంపిటిసి స్థానం కోసం గ్రామపంచాయతీలో మూడు, లోడుపల్లిలో రెండు, చెడువాయి ఎంపిటిసి స్థానం కోసం దర్గపల్లి గ్రామపంచాయతీలో ఒకటి, చెడువాయిలో మూడు, పోతేపల్లి గ్రామపంచాయతీలో రెండు, ఎల్లూర్ ఎంపిటిసి పరిధిలో గ్రామపంచాయతీలో నాలుగు, పెంచికలపేట్‌లో ఒకటి, ఎల్కపల్లి ఎంపిటిసి పరిధిలో జీపిలో మూడు, బొంబాయిగూడ గ్రామంలో రెండు, కమ్మర్ గాం ఎంపిటిసి పరిధిలో మూడు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాజకీయ పార్టీల నాయకులు కూడా సహకరించి, ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఎన్నికల ప్రక్రియ కొనసాగేందుకు కృషి చేయాలని కోరారు.

## కుర్తా ఆలయం వరకు రోడ్డు సౌకర్యం



**ప్రజాపక్షం/ కౌటాల:** మండలంలోని తాటి పెల్లి గ్రామ శివారులోని వార్దనది కుర్తా వద్ద గల శ్రీ శివ సిద్ధి హనుమాన్ ఆలయంలో ఈనెల 24వ తేదీ నుండి 28 వరకు శివరాత్రి మహోత్సవ ఉత్సవాలు జరగనున్నందున గురువారం నది ఒడ్డు నుండి ఆలయం వరకు మొరం రోడ్డు పనులను ఎంఎల్ఏ దండే విఠల్ సహకారంతో ప్రారంభించినట్లు ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బొమ్మ కంటి మహేష్, ఆలయ కమిటీ చైర్మన్ ఎల్ములే దత్తులు తెలిపారు. ఆలయ అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయాలని ఈ సందర్భంగా ఎంఎల్ఏకి వినతిపత్రం అందజేసినట్లు, దానికి వారు సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. వారి వెంట మాజీ జెడ్పి చైర్మన్ సిడం గణపతి, ఆలయ కమిటీ సభ్యులు ఉన్నారు.

## నాటిన ప్రతి మొక్కను కాపాడాలి...



**ప్రజాపక్షం / బాన్సువాడ :** గ్రామాలలో ఉపాధి హామీ పథకం కింద నాటిన ప్రతి మొక్కను కాపాడే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్, మేట్, పంచాయతీ కార్యదర్శులపై ఉందని, మొక్కలు కాపాడడం బాధ్యతగా తీసుకొని ప్రభుత్వ ధనాన్ని వృధా కాకుండా చూడాల్సిన అవసరం మనందరిపై ఉందని ఏపిడి వామన్ రావు అన్నారు. గురువారం బాన్సువాడ మండల అభివృద్ధి కార్యాలయంలో ఉపాధి హామీ సామాజిక తనిఖీ ప్రజావేదిక చేపట్టారు. ఈ సందర్భంగా పలు గ్రామాలలో ఉపాధి హామీ పనుల వివరాలను సంబంధిత అధికారులు చదివి వినిపించారు. మొగులాన్‌పల్లి గ్రామంలో జాబ్‌కార్డు ఉపాధి కూలీలకు మేట్లు పని కల్పించి వారి కుటుంబ సభ్యులకు హాజరు వేసినట్లు రుజువు కావడంతో మరోసారి కూడా పునరావృతం కాకుండా చూడాలన్నారు. ఉపాధి హామీ పనులను క్షేత్రస్థాయిలో సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ జరపాలని, ఉపాధి హామీ కూలీలకు మాస్టర్లు కీలకం కావడంతో మాస్టర్లను పంచాయతీ కార్యదర్శి, ఫీల్డ్ అసిస్టెంట్, మేట్లే బాధ్యత వహించాలని సూచించారు. ఉపాధి హామీ పథకం పట్ల ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు నిర్లక్ష్యం వహిస్తే శాఖాపరమైన చర్యలు ఉంటాయన్నారు. కార్యక్రమంలో ఎంపిడీవో బషరుద్దీన్, ఎంపివో సత్యనారాయణ రెడ్డి, జిల్లా విజిలెన్సు అధికారి ప్రశాంత్, ఎస్ఆర్పి మహేష్, ఏపివోలు భిక్షపతి, మల్లేష్, టెక్నికల్ అసిస్టెంట్ గంగాధర్, పంచాయతీ కార్యదర్శులు నవీన్ కుమార్, దయానంద్, రాజేష్, ప్రశాంతి, రహేలా బేగం, గణేష్, సాయికుమార్, భరత్, సచిన్, నవీన్ గౌడ్, గీత, గురునాథ్, ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘన..



**ప్రజాపక్షం/నేరడిగొండ :** మండలంలో ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ కొనసాగుతున్నప్పటికీ ఎలాంటి ప్లెక్సీలు ప్రచార బోర్డులు పెట్ట కూడదని నిబంధన ఉన్న,మండలంలో అవేమీ పట్టనట్టు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ స్వాగతం ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు.ఇంత జరుగుతున్న సంబంధిత శాఖ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని బుగ్గారం బి గ్రామంలో భీమన్న జాతర నిర్వహించారు.ఆ కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరు అవుతున్న సందర్భంగా పార్టీ నాయకులు ఎన్నికల కోడ్ ఉన్నదన్న పట్టింపు లేకుండా స్వాగతం ఫ్లెక్సీలు పెట్టారు.అది చూసిన పలువురు గ్రామస్తులు మేధావులు ఎన్నికల కోడ్ ను తుంగలో తొక్కుతున్నారని ఎలక్షన్ కమిషన్ కి కనీస గౌరవాన్ని ఇస్తాలేరని ఇప్పటికైనా వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## తలమడుగులో వెంకటేశ్వరా స్వామి పల్లకి ఊరేగింపు..

**ప్రజాపక్షం/తలమడుగు :** తలమడుగు మండల కేంద్రంలోని ప్రసిద్ధ శ్రీ లక్ష్మి వెంకటేశ్వర ఆలయంలో గురువారం పద్మావతి సమేత లక్ష్మి వెంకటేశ్వరాస్వామి ఉత్సవ మూర్తులను ఊరి ప్రధాన విధుల గుండా ఊరేగించడం జరిగింది.ఉదయం నుండే ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది అందంగా ఆకర్షనీయంగా ముస్తాబు చేసిన ఉత్సవ విగ్రహాలను ఆలయం నుండి భక్తులు గ్రామస్తులు శోభయాత్రగా బయలు దేరి ప్రతి ఇంటిలోని మహిళకు బొట్టు పెట్టి పల్లకి ఊరేగింపు కోసం ఆహ్వానించడం జరిగింది నమో వెంకటేశాయ నమో నారాయణయ అనే నమస్మరణతో విధులు మొత్తం మారుమ్రోగాయి మహిళలు పెద్ద ఎత్తున హాజరై ఈ కార్యక్రమాన్ని ముందుండి నడిపారు.ఈ కార్యక్రమంలో ఆలయం కమిటీ సభ్యులు భక్తులు గ్రామస్తులు పాల్గొన్నారు.

## పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అసెంబ్లీ వర్క్ షాప్ నిర్వహణ..

**ప్రజాపక్షం/ఖానాపూర్:** ఖానాపూర్ పట్టణం సీఎంరావు గార్డెన్ లో ఇట్టి కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర నాయకులు రితేష్ రాథోడ్ నిర్మల్ జిల్లా ప్రధాన కార్యదర్శి సామారాజేశ్వర్ రెడ్డిలు,మాట్లాడుతూ రాబోయే ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ బలపర్చిన అభ్యర్థి మాల్క కొమురయ్య కి మొదటి ప్రాధాన్యత ఓటు వేయించాలని,పట్టభద్రులు ఎక్కడ ఉన్నా వారి సమస్యను తెలుసుకొని ఆ సమస్యను పరిష్కరించే విధంగా ప్రభుత్వాన్ని అడిగే సామర్థ్యం తమ పార్టీకే ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ ఇంచార్జి రవి పాండే,అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్,బీజేపీ మండల అధ్యక్షులు పుష్పాల ఉపేందర్,బీజేపీ ఆదిలాబాద్ జిల్లా ఉపాధ్యక్షుడు కొండెరి రమేష్,బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ ప్రకాష్,రెడ్డి బూత్ ఎన్నికల ఇంచార్జ్‌లు తదితరులు ఉన్నారు.

## ఎంపిడిఒ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల మీటింగ్..

**ప్రజాపక్షం/కడెం:** రానున్న ఎన్నికల్లో భాగంగా కడెం మండల ఎంపీడీఓ అరుణ ఆధ్వర్యంలో గురువారం రోజున అన్ని రాజకీయ పార్టీల కార్యక్రమం ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో అన్ని రాజకీయ పార్టీల నాయకులు హాజరు అయ్యారు.రానున్న ఎన్నికల్లో పోలింగ్ కేంద్రాల గురించి,ఏదైనా సమస్యలు ఉంటే 15లోపు సమస్యలని తమ దృష్టికి తీసుకురావాలని ఎంపీడీఓ తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ నాయకులు పొద్దుటూరి సతీష్ రెడ్డి,బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల జీవన్ రెడ్డి,బీజేపీ నాయకులు గట్ల నల్లగొండ,బిఎస్పి నాయకులు జోసెఫ్,కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు బరుపటి రమేష్ వర్మ,యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శి ముడికె మల్లేష్ యాదవ్,నాయకులు కొల గంగన్న,రమేష్,యాదగిరి,సత్యం రాజన్న,కోటయ్య,తదితరులు పాల్గొన్నారు.

# డంపు యార్డ్‌కు టిఆర్ఎస్ అనుమతి ఇచ్చిందని అనడం అవాస్తవం

### పార్టీలకతీతంగా అందరూ కలిసి డంపు యార్డు నిలిపివేసేందుకు పోరాడుదాం: ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి



ప్రజాపక్షం/నర్సాపూర్:నర్సాపూర్ ప్రాంత అభివృద్ధికి ఆటంకం కలిగిస్తూ అభివృద్ధి నిరోధకులుగా మారకూడదని కాంగ్రెస్ నాయకులకు సూచిస్తూ అదే విధంగా నర్సాపూర్ పట్టణానికి మంజూరైన టూరిజం హోటల్ అర్బన్ పార్క్ కాటేజెస్ పలు అభివృద్ధి పనులు నిలిపి వేయకుండా అందరం కలిసికట్టుగా ప్రాంత అభివృద్ధికి పార్టీలకతీతంగా సహకరించాలని ఎమ్మెల్యే సునీత లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం నర్సాపూర్ పట్టణంలోని ఆమె నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నర్సాపూర్ అటవీ ప్రాంతంలో నిర్మిస్తున్న డంపు యార్డు కు టీఆర్ఎస్ ప్రభుత్వమే అనుమతులు ఇచ్చింది అనడంలో ఎలాంటి వాస్తవం లేదన్నారు. అంతకు ముందు 2008 09 లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వమే ఈ ప్రాంతాన్ని కి డంపు యార్డ్ కు భూమిని కేటాయించినట్లు ఆమె తెలిపారు. ఈ డంపు యార్డ్ తో నర్సాపూర్ నియోజకవర్గానికి శాపంగా మారుతుందని పచ్చని అడవిలో చిచ్చు పెట్టినట్లు అవుతుందని పేర్కొన్నారు. ఇందుకోసం రాజకీయాలకతీతంగా పార్టీలన్నీ ఏకమై డంపు యార్డ్ ను నిలిపివేసేంతవరకు ప్రజలు విద్యార్థులు యువతి యువకులు అందరూ కలిసికట్టుగా పోరాటం సాగించాలని ఆమె అన్నారు. అంతేగాక అన్ని రాజకీయ పార్టీలు జాక్ జేఏసీ ఏర్పాటు చేయాలని దీనితో డంపు యార్డ్ ను రద్దు కోసం ఉద్యమించాలని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం నర్సాపూర్ నియోజకవర్గానికి నర్సాపూర్ మున్సిపాలిటీకి వచ్చిన అభివృద్ధి నిధులను నిలిపి వేసిందని ఆమె మండిపడ్డారు. ఇప్పటికైనా విమర్శలు మాని పార్టీలకతీతంగా అభివృద్ధికి సహకరించాలని ఆమె కోరారు. డంపు యార్డు ను రద్దు చేయాలని కోరుతూ రాష్ట్ర మంత్రులను కలిసి విజ్ఞప్తి చేశామని తెలిపారు. డంపు యార్డు తో వన్య ప్రాణులకు నష్టం త్రాగునీరు గాలి కలుషితమై ప్రజలకు ఈ డంపింగ్ యార్డ్ పెనుముప్పుగా మారనుందని అన్నారు. మన అడవిని అందరం కలిసి కాపాడుకుందాం అని డంపు యార్డు రద్దు చేసేంతవరకు వరకు అందరూ ఉద్యమించాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు నయీముద్దీన్, సత్యం గౌడ్, నడిపి లావణ్య రవి, జితేందర్ రెడ్డి, మానయ్య శ్రీనివాస్ రెడ్డి, షేక్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీవో కార్యాలయంలో కనీస వసతులు కరువు

### మెదక్ పట్టణ బిఆర్ ఎస్ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు



ప్రజాపక్షం/మెదక్ ప్రతినిధి : మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న ఆర్టీ వో కార్యాలయంలో వాహనదారులకు కనీస వసతులు లేక నానా ఇబ్బందులు పడుతున్నారని, వారికి వెంటనే వసతులు కల్పించాలని మెదక్ పట్టణ బిఆర్ ఎస్ కన్వీనర్, మాజీ కౌన్సిలర్ మామిళ్ళ ఆంజనేయులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ పట్టణంలోని ఆర్టీవో కార్యాలయంలో వాహనదారులకు కనీస వసతులు లేకుండా త్రాగడానికి మంచినీరు కూడా ఏర్పాటు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.వాహనదారులకు కనీస మర్యాద లేకుండా 100 మీటర్ల దూరం తరిమికొట్టడం ఎందుకని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రమైన ఎండలు మండిపోతున్నందున తక్షణమే ఆర్టీవో వాహనదారులకు కనీస వసతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కు బిఆర్ ఎస్ పార్టీ తరపున ఫిర్యాదు చేస్తామని పేర్కొన్నారు.

# ఎంకేపల్లిలో ఇసుక నిలువలు సీజ్



ప్రజాపక్షం/పాపన్నపేట:మంజీరా నది నుండి అక్రమంగా ఇసుకను తరలించి నిల్వ ఉంచిన ఇసుక కుప్పలను సీజ్ చేసినట్లు తహసిల్దార్ సతీష్, ఏఎస్ఐ సంఘున్న హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని ఎనకపల్లిలో ఇసుక నిల్వలు అక్రమంగా నిలువ చేసి రాత్రి వేళలో బయటకు తరలిస్తున్నారని సమాచారం రావడంతో పోలీస్ రెవెన్యూ శాఖ వారు సీజ్ చేశారు. నిబంధనలకు విరుద్ధంగా మంజీరా లోంచి అక్రమంగా ఇసుకను గ్రామంలో నిలువ ఉంచిన సుమారు 35 ట్రాక్టర్ల విలువ చేసే ఇసుకను వారు సీజ్ చేశారు. ప్రజలు స్వచ్ఛందంగా ఇసుక తవ్వకాలపై పోలీసు, రెవెన్యూ శాఖల అధికారులకు సమాచారం ఇవ్వాలని ఈ సందర్భంగా సూచించారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని పేర్కొన్నారు.

# పని ప్రదేశాలలో వేధింపులకు పాల్పడితే కఠిన చర్యలు

### -జిల్లా న్యాయ సేవాధికార సంస్థ బి.రమేష్




ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధిః పని ప్రదేశాలలో లైగింక వేదింపులకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని , కఠిన చర్యలు తీసుకోనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి ,న్యాయమూర్తి బి. రమేష్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జిల్లా ప్రధాన న్యాయ మూర్తి భవాని చంద్ర ఆదేశాల మేరకు న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి న్యాయమూర్తి బి. రమేష్ గురువారం జిల్లా అటవీ శాఖ కార్యాలయంలో పని ప్రదేశాలలో లైగింక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై అవగాహన కల్పించారు. పి.ఓ.ఎస్.హెచ్ చట్టం 2013 పని ప్రదేశాలలో స్త్రీలపై లైగింక వేధింపులు జరపరాదని ,జరిపిన వారు కఠినంగా శిక్షించబడతారని తెలిపారు. మహిళా ఉద్యోగులు ,కార్మికులు ఎక్కడైనా లైంగిక వేదింపులకు గురైతే ఫిర్యాదు ఇవ్వవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అటవి శాఖ అధికారి శ్రీధర్ రావు , అటవీ శాఖ ఉద్యోగులు, ఎక్సైజ్ శాఖ ఉద్యోగులు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# సంస్కారవంతమైన చదువు భవిష్యత్తుకు పునాది

### చేతి రాత నిపుణులు అజాజ్ అహ్మద్



ప్రజాపక్షం/టేక్మాల్ : సంస్కారవంతమైన చదువు భవిష్యత్తుకు పునాదిగా నిలుస్తుందని ప్రముఖ చేతి రాత నిపుణులు అజాజ్ అహ్మద్ అన్నారు. పి.ఎం. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం విద్యార్థులకు తెలుగు, హిందీ, ఇంగ్లీష్ లలో అద్భుతమైన చేతి రాత అభివృద్ధిపై ప్రముఖ చేతి రాత నిపుణులు అజాజ్ అహ్మద్ అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తల రాతను మార్చటం కష్టం కావచ్చు కానీ చేతి రాత అందంగా మార్చుకోవడం సులభమని అంతేగాక అందమైన చేతి రాత ద్వారా మనలోని ప్రతిభను మెరుగుపరుచుకోవచ్చని తద్వారా మన భవిష్యత్తును అందంగా మార్చుకోవచ్చని ఆయన అన్నారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.అశోక్ అధ్యక్షతన ఈ చేతి రాత అవగాహనా సదస్సును నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, మల్లేశ్వరి, శంకర్, రమేష్, మురళి, సుభాష్, సి.ఆర్.పి.మొగులయ్య, మల్లేశం పాల్గొన్నారు.

# జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ద్వార ఉచిత న్యాయ సహాయం

### - సీనియర్ న్యాయవాది వేణుగోపాల్‌రావు

ప్రజాపక్షం/కొండాపూర్ : జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ద్వార ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని సీనియర్ న్యాయవాది వేణుగోపాల్‌రావు ప్రేమ జంటలకు హితవు చెప్పారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో ప్రేమికులకు అండ దండగా ఉండి 74 ప్రేమ వివాహాలు జరిపించినట్లు సీనియర్ న్యాయవాధి ఈటూరి వేణుగోపాల్‌రావు ప్రేమికుల దినోత్సవం సందర్భంగా మాట్లాడుతూ ప్రేమించడం తప్పు కాదని పెద్దలను సాధ్యమైనంత వరకు ఒప్పించే ప్రయత్నం చేయాలన్నారు. అమ్మాయిలు, 17 ఏళ్ల నిండగానే పెళ్ళిళ్ళు చేసుకుంటున్నారని ,వివాహ వయస్సు 18 పూర్తయి ఉండాలని, అంటే 19 ఏళ్ళు వచ్చి ఉండాలని ,అబ్బాయిలకైతే 21 ఏళ్ల పూర్తయి ఉండాలని సూచించారు. ప్రేమ సమస్యలు ఎదుర్కొంటున్న యువతీ,యువకులు ,వారి తల్లి దండ్రులు 9440291026 నంబరును సంప్రదించి సహకారం పొందవచ్చునని వేణుగోపాల్‌రావు పేర్కొన్నారు. ఉచిత న్యాయ సహాయం కొరకు జిల్లా న్యాయసేవా అధికార సంస్థ ద్వారా కూడా పైసా ఖర్చు లేకుండా సమస్యలు పరిష్కరించు కోవచ్చునని తెలిపారు.

# సర్వేయర్ పై దాడి

ప్రజాపక్షం/పాపన్నపేట: భూమిని సర్వే చేసి తిరిగి వస్తున్న సర్వేయర్ పై ఇద్దరు వ్యక్తులు దాడి చేసిన సంఘటన మండలంలో చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్ గౌడ్ కథనం ప్రకారం మండలంలో సర్వేయర్ గా విధులు నిర్వహిస్తున్న హహోబిలం శ్రీనివాస్ ఇదే మండలం యూసుఫ్‌పేట గ్రామానికి చెందిన తీగల మల్లేశం అనే వ్యక్తి భూమిని సర్వే చేయడానికి బుధవారం యూసుఫ్‌పేట గ్రామానికి వెళ్ళాడు. సర్వేచేసి తిరిగి వస్తుండగా గ్రామ బస్టాండ్ సమీపంలో అదే గ్రామానికి చెందిన ఎరుపుల శ్రీనివాస్, ఎరుపుల గంగయ్య అనే ఇద్దరు వ్యక్తులు సర్వేయర్ బైక్ ను ఆపి బూతూ మాటలు తిట్టి చేతులతో, హెల్మెట్ తో ముఖంపై కొట్టారు. సర్వేయర్ శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు దాడి చేసిన ఇద్దరు వ్యక్తులపై గురువారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

# మహాశివుడికి కలశం పూజ



ప్రజాపక్షం/సదాశివపేట :సదాశివపేటలో ద్వాదశ జ్యోతిరిలింగ శివ కలశం పూజను పూజ మందిరంలో శ్రీ సంగమేశ్వర మందిరంలోని సన్నిదానం స్వాములందరూ కలిసి రాచన్న గురుస్వామి ఆద్వర్యంలో మొట్లకుంట సురేష్ గురుస్వామి దంపతులు ఆద్వర్యంలో తన నివాసం లోనే దేవాది దేవుడు అయిన పరమశివుడి కలశం పూజను జరిపించడం జరిగింది. ఈ పూజ కార్యక్రమంలో భక్తిశ్రద్ధలతో భజన కీర్తనలతో భక్తులు పాల్గొని ఘనంగా కలశ పూజను శివ నామస్మరణలతో అంగరంగ వైభవంగా జరిగింది. రుద్రాభిషేకం , నమ్మకం చామకం, లింగష్టకం పటిస్తూ పూజ విధానం జరిగింది. ఈ కలశ పూజను ఉదయం 11 గంటలకు మొదలుకొని మధ్యాహ్నం 2 గంటల వరకు 12 జ్యోతిర్లింగ కలశం పూజను జరిపిస్తూ పూజా కార్యక్రమం జరిపించారు. ఈ కార్యక్రమంలో సంగారెడ్డి నియోజకవర్గ ఎమ్మెల్యే చింత ప్రభాకర్ తనయుడు సాయినాథ్ పాల్గొని ఆ దేవాది దేవుని ఆశీస్సులు తీసుకోవడం జరిగింది. చింత సాయినాథ్ రాచరణ గురుస్వామి పూల మాలతో సత్కరించి ధన్యవాదాలు తెలిపారు. తదుపరి అన్న ప్రసాదం కార్యక్రమం కూడ జరిగడం జరిగింది. ఈ కార్యక్రమంలో శివ స్వాముల భక్త బృందం ,భక్తులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న గురుస్వామి, మధునాల నరసింహులు , గురుస్వామి, రాజశేఖర్ గురుస్వామి, పాండు గురుస్వామి, వెంకటేశం గురుస్వామి ,మల్లేశం గురుస్వామి, లోకేష్ గురుస్వామి శ్రీరామ్ శ్రీనివాస్ గురుస్వామి, శంకర్ గురుస్వామిలు పాల్గొన్నారు.

# నవ వధువు కుటుంబానికి పుస్తె మెట్టెలు అందజేత

ప్రజాపక్షం/శివ్వంపేట : శివ్వంపేట మండలం చిన్నగొట్టిముక్ల



గ్రామానికి చెందిన పట్నం నర్సింలు లక్ష్మి దంపతుల కూతురు దీపిక వివాహానికి గురువారం బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి సహకారంతో పుస్తె మెట్టెలను బిజెపి మండలాధ్యక్షులు పెద్దపులి రవి చేతులమీదుగా అందజేశారు. ఆయన మాట్లాడుతూ బిజెపి నాయకులు రఘువీరారెడ్డి పేద ప్రజలను ఎన్నో సేవ కార్యక్రమాలు చేస్తున్నారని ఆయన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో చిన్నగొట్టిముక్ల బూత్ అధ్యక్షులు భూమిరావు, రమేశ్ తదితరులు ఉన్నారు.

# మార్చి 8న జాతీయ లోక్ ఆదాలత్

## జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మేన్ జి భవాని చంద్ర ఆద్వర్యంలో సమీక్ష సమావేశం




**ప్రజాపక్షం/సంగారెడ్డిప్రతినిధి :** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జి. భవాని చంద్ర గురువారం న్యాయవాదులతో వచ్చే నెల 8 వ తేదిన జాతీయ లోక్ ఆదాలత్ సందర్బంగా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం నందు న్యాయమూర్తి మాట్లాడుతూ రాజీ చేయదగ్గ పోలీస్ కేసులు, భార్యభర్తల చిన్న చిన్ని వివాదాలు, ఎక్సైజ్ కేసులు ,బ్యాంక్ కేసులు తదితర కేసులు రాజీ చేయదగ్గ కేసులలో ఇరు వర్గాలు లోక్ ఆదాలత్ ద్వారా రాజీ కుదుర్చుకోవచ్చు నన్నారు. క్షణికావేశంలో ఇరువర్గాలు చిన్న చిన్న తగాదాలు పడి కేసులు నమోదు జరిగి కోర్టు చుట్టూ తిరుగుతూ తమ తమ విలువైన సమయాన్ని వృదా చేసుకోకుండా కోర్టులో తమ తమ పై ఉన్నటువంటి కేసులను రాజీ చేసుకుని సామరస్యంగా, స్నేహభావంతో కలిసి మెలిసి ఉండాలన్నారు. న్యాయవాదులు అందరు. సహకారం అందించి ఈ లోక్ ఆదాలత్‌ను విజయవంతం చేయాలని కక్షి దారులకు పెద్ద మొత్తంలో నష్టపరిహారం వచ్చేలా కేసులు పరిష్కరించుకోవాలని తెలిపారు. ఈ సమావేశం నందు జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. భవాని, చంద్ర జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి బి.రమేష్, బార్ ప్రెసిడెంట్ విష్ణువర్దన్ రెడ్డి, సీనియర్ ,జూనియర్ న్యాయవాదులు పాల్గొన్నారు.




## అందుబాటులో పోలింగ్ బూతులను ఏర్పాటు చేయాలి

**ప్రజాపక్షం/కొండాపూర్ :** ఓటర్లకు అందుబాటులో పోలింగ్ బూతులను ఏర్పాటు చేయాలని పార్టీల ప్రతినిధులు అధికారులను కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలో అదనంగా మూడు పోలింగ్ బూతులను ఏర్పాటు చేయాలని కాంగ్రెస్ మండల అద్యక్షుడు వై .ప్రభు కోరారు. గురువారం మండల కేంద్రమైన కొండాపూర్‌లోని మండల పరిషత్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల ఎన్నికల దృష్ట్యా అన్ని రాజకీయ పార్టీల ప్రతినిదులు ఎంపిడిని కోరారు.

## జేఇఇ మెయిన్స్‌లో పోచారం కార్తీక్ ప్రతిభ

-సన్మానించిన బంగారు కృష్ణ



**ప్రజాపక్షం/కొండాపూర్ :** మండల పరిధిలోని తొగర్పల్లి గ్రామానికి చెందిన విద్యార్థి జేఈఈ మెయిన్స్ తొలి విడత పేపర్ 1 ఫలితాల్లో 99.17 పర్సెంటేజ్ మార్కులను పోచారం కార్తీక్ సాధించారు. ఈ సందర్బంగా పోచారం కార్తీక్‌ను బంగారు కృష్ణ సన్మానించారు. సంగారెడ్డి పట్టణంలో ఇష్టా గ్రూప్ ఆప్ ఇన్సిట్యూషన్ లో కార్తిక్ చదువుతున్నాడు.తల్లిదండ్రులు పోచారం వసంత రావు సంగారెడ్డి పట్టణం హైటెక్ కాలనీలో నివాసం ఉంటున్నారు. తండ్రి పోచారం వసంత రావు విద్యుత్ కార్యాలయం లైన్ మెన్ ,తల్లి సులోచన ఆరోగ్య శాఖలో ఏ.ఎన్.ఎంగా విధులు నిర్వహిస్తున్నారు. తల్లి దండ్రుల సహకారం కళాశాల ప్రిన్సిపాల్, అద్యాపకుల కృషి, అంకిత బావంతో ఈ మార్కులు సాదించానిని కార్తీక్ అన్నాడు. ఈ కార్యక్రమంలో చింతల సాయి కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రొసిడింగ్ ఆఫసర్లకు ఎన్నికల శిక్షణ

### రెండవ ఆర్డినరీ గ్రామ పంచాయతీ ఎన్నికల శిక్షణ కార్యక్రమం




**ప్రజాపక్షం/సదాశివపేట :** సధావశివ పేట మండలం లోని మద్దికుంట గ్రామం శివారులో ఓ ఫంక్షన్ హాల్‌లో ఎంపిడిఓ లక్ష్మి అద్యక్షతన శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగిది. ఈ సందర్బంగా శిక్షణ కార్యక్రమాన్ని ఉద్దేశించి ఎంపిడిఓ లక్ష్మి మాట్లాడుతూ ఎన్నికలు పారదర్శకంగా నిర్విహించాలని ఏలాంటి పొరపాట్లు లేకుండా విధులు నిర్వహించి ,విధులలోఅలసత్వం ప్రదర్శించకుండా సమయ స్పూర్తితో వ్యవహరించి ఎన్నికలు విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిఓ సంతోష్ కుమార్, ఎంఈఓ శంకర్, ఎమ్ ఎన్ ఓ సుధాకర్, మాస్టర్ ట్రైనర్ జోషి, కిష్టయ్య, సాయిబాబా, సదాశివపేట, మండలంలోని గ్రామ పంచాతీల కార్యదర్శులు కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## పేటలో శ్రీ కోటి లింగేశ్వర మఠం వార్షికోత్సవ వేడుకలు



**ప్రజాపక్షం/సదాశివపేట :** సదాశివపేట మండలం తంగడపల్లి శ్రీ కోటి బిల్వ లింగేశ్వర మఠం శ్రీగురు గంగాధర స్వామి ఆశ్రమం గంగమయ్య గుట్ట 29 వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మొదటి రోజు షటస్థల బ్రహ్మ 108 శ్రీశ్రీశ్రీ శివయోగి శివచార్య మహాస్వామి వారి కరకమలములచే ప్రథమముగా గోపూజ, ధ్వజారోహణము ,యాగశాల, ప్రవేశము, అఖండ దీపారాధన, అవాహిక మంటపారాదన ,అగ్ని ప్రతిష్ట నిర్వహించారు. పూజ గురువర్యులు లోక కళ్యాణం కోసం భక్తులందరూ కూడా సస్య శ్యామలమైనటువంటి పంటలతో ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ,ఆలయ ప్రాంగణంలో ఏడు రోజుల పాటు చండీ వాహనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.. సాయం కాలం దేవి భాగవతి పురాణము తదితర ఆద్యాత్మిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు ,జంగం, మహేష్ స్వామి, మడివాలయ స్వామి, విజయస్వామి, ఓకార్ స్వామి ,బన్నయ్య స్వామి, దంపతులు ,భక్తులు పాల్గొన్నారు.

## తోర్నాలలో అట్టహాసంగా ప్రారంభమైన రాష్ట్ర స్థాయి పాలిటెక్నిక్ క్రీడలు

### మూడు రోజుల పాటు జరగున్న క్రీడలు




**ప్రజాపక్షం/సిద్దిపేట ప్రతినిధి:** వ్యవసాయ పాలిటెక్నిక్ రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు సిద్దిపేట జిల్లాలోని తోర్నాల వ్యవసాయ పాలిటెక్నిక్ కళాశాల వేదిక అయింది. 2015లో ఏర్పాటు చేసిన ఈ కళాశాలలో తొలిసారి రాష్ట్ర స్థాయి క్రీడలు నిర్వహిస్తున్నారు. కంపాసాగర్, పాలెం, మాల్తుమ్మెద, జోగిపేట, తోర్నాల, రుద్రూరు, మధిర, కంది. జమ్మికుంట, బసంతపూర్, నారాయణపేట కళాశాల నుండి 211 మంది క్రీడాకారులు పాల్గొంటున్నారు. వాలీబాల్, టెబుల్ టెన్నిస్, క్యారమ్స్, త్రో బాల్, టెన్నికాయిట్, రన్నింగ్, జావలిన్ త్రో, వ్యాసరచన, ఉపన్యాస,క్విజ్ పోటీలలో తలపడనున్నారు. కళాశాల ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా ముగ్గుల పోటీలు, పాటలు, నృత్య పోటీలు సైతం నిర్వహిస్తున్నారు. వ్యవసాయ విశ్వవిద్యాలయం డీన్ డా. సిహెచ్ వేణుగోపాల్‌రెడ్డి జ్యోతిప్రజ్వలన చేసి జెండా ఊపి క్రీడలను ప్రారంభించారు. కార్యక్రమంలో వ్యవసాయ ఉప సంచాలకులు డా ఉమారెడ్డి, యూనివర్సిటీ క్రీడా పోటీల పరిశీలకులు సురేశ్, జిల్లా వ్యవసాయాధికారి రాధిక, తోర్నాల ప్రిన్సిపాల్ శ్రీదేవి తదితరులు ఉన్నారు.

## కూనూరు పాఠశాలలో ఘనంగా ఆంగ్లభాషా దినోత్సవం



**ప్రజాపక్షం/జఫర్‌గడ్:** సరోజిని నాయుడు జన్మదినోత్సవా న్ని పురస్కరించుకుని తెలంగాణ విద్యాశాఖ ఇచ్చిన పిలుపుమేరకు స్థానిక కూనూరు పాఠశాలలో ఆంగ్లబాషా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు రమేష్ బాబు, రాంబాబులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు స్టోరి టెల్లింగ్, ఎస్సే, క్విజ్ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి గెలుపు ఖాయం


- బిజేపి రాష్ట్ర నాయకులు నూకల పద్మారెడ్డి



**ప్రజాపక్షం/హత్నూర :** ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజేపి అభ్యర్థి గెలుపు ఖాయమని బిజేపి రాష్ట్ర నాయకులు నూకల పద్మారెడ్డి అన్నారు. గురువారం హత్నూర మండలం దౌల్తాబాద్ లో బిజేపి అద్యక్షులు నాగ ప్రభు గౌడ్ ఆద్వర్యంలో ఎమ్మెల్సీ ఎన్నికల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా రాష్ట్రనాయకురాలు నూకల పద్మారెడ్డి ,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రఘువీరారెడ్డి హాజరయ్యారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఉమ్మడి కరీంనగర్ ,నిజామాబాద్ ,ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి బిజేపి బలపరిచిన అభ్యర్థి అంజిరెడ్డి, గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. దేశంలో ప్రధాన మంత్రి మోడీ చేపట్టిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలే నేటి గెలు పు కారణమన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బిజేపి అభ్యర్థి గెలుపే ల క్ష్యంగా వ్యూహరచన ప్రచార కార్యచరణ పై సమగ్ర సమావేశం నిర్వహించి ఇన్చార్జీలను నియమించడం జరిగిదని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజేపి జిల్లా ఉపాద్యక్షులు రాజామల్లారెడ్డి, మండల నాయకులు శ్రీశైలం , రాజేష్, రాజు కుమార్, మల్లే ష్ , నాగరాజు గౌడ్, సాయిరాం,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

## ఎంపిటిసి, జడ్పీటిసి డ్రాఫ్ట్ పబ్లికేషన్ పై అవగాహన

**ప్రజాపక్షం/జగదేవ్‌పూర్:** ఎంపిటిసి, జడ్పీటిసి డ్రాఫ్ట్ పబ్లికేషన్‌పై



ఆయా రాజకీయ పార్టీల నాయకులతో ఎంపిపి కార్యాలయంలో ఎంపిడిఒ యాదగిరి ఆధ్యక్షతన గురువారం అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ ఎంపిటిసి, జడ్పీటిసి డ్రాఫ్ట్ పోలింగ్ స్టేషన్ల వివరాలను ఆయా గ్రామ పంచాయతీ కార్యాలయాలలో ప్రదర్శించినట్లు తెలిపారు. ఎన్నికల పక్రియ ,ఓటర్ జాబితా, పోలింగ్ స్టేషన్లపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సజావుగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు కొంపల్లి కరుణాకర్, బిజెపి నాయకులు కందుల బాల్‌రాజు, బిఆర్ఎస్ నాయకులు కొత్త కవిత శ్రీనివాస్‌రెడ్డి, సిపిఎం నాయకులు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ ఎన్నికలపై బిజెపి నాయకుల సమావేశం



**ప్రజాపక్షం/కొహెడ:** పట్టభద్రుల,ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పై గురువారం రోజున తీగలకుంటపల్లి చింతల తోటలో ఎమ్మెల్సీ ఎన్నికలపై బిజెపి కొహెడ మండల సన్నాహక సమావేశం బిజెపి మండల అధ్యక్షుడు జాలిగం రమేష్ అధ్యక్షతన జరిగింది.ఈ సందర్భంగా సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన బిజెపి పార్లమెంట్ కన్వీనర్ ఎమ్మెల్సీ ఎన్నికల హుస్నాబాద్ అసెంబ్లీ ప్రభారీ బోయినిపల్లి ప్రవీణ్ రావు మాట్లాడుతూ నిరుద్యోగ ఉపాధ్యాయ సమస్యలపై గొంతెత్తి గర్జించిన పార్టీ బిజెపి పార్టీ అని, గ్రూప్ వన్ అభ్యర్థులకు అన్యాయం జరిగినప్పుడు న్యాయం కోసం కొట్లాడిన పార్టీ బిజెపి పార్టీ అని, పట్టభద్రుల ప్రతి సమస్యలపై ప్రభుత్వంపై సమరశంఖం పూరించి అండగా నిలిచిన బిజెపి పార్టీని పట్టభద్రులు ఉపాధ్యాయులు ఆదారించి బిజెపి పట్టభద్రుల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థులైన అంజిరెడ్డి, కొమురయ్యలను మొదటి ప్రాధాన్యత ఓటువేసి గెలిపించాలన్నారు.ఈ కార్యక్రమంలో బిజెపి హుస్నాబాద్ అసెంబ్లీ కన్వీనర్ గుర్రాల లక్ష్మారెడ్డి, ఖమ్మం వేంకటేశం, పిల్లి నర్సయ్య, మ్యాకాల రజినీకాంత్‌రెడ్డి, ద్యాగల సురేందర్, బాపురెడ్డి, తదితరులు పాల్గొన్నారు.